ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
1
అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 5 జూన్ 2024


రాంనగర్‌లో టీడీపీ, జనసేన అభిమానుల సందడి..


పరిటాల సునీత ఇంటి వద్ద కార్యకర్తల కోలాహలం..


అనంతలో దగ్గుపాటి నివాసం వద్ద సంబరాలు..

సైకిల్ సునామీ

ఉమ్మడి జిల్లాలో ఊడ్చేసిన కూటమి

- 13 స్థానాల్లో టీడీపీ.. ఒకచోట బీజేపీ జయభేరి
- ఊహల్లో తేలిన వైసీపీకి చారిత్రక పరాజయం
- రాప్తాడులో పరిటాల సునీత రెండోసారి విజయం
- ఉరవకొండ సెంటిమెంట్‌ను బద్దలుకొట్టిన కేశవ్
- దుర్గంలో సత్తా చాటుకున్న మాజీ మంత్రి కాలవ
- గుమ్మనూరును అక్కున చేర్చుకున్న గుంతకల్లు
- కళ్యాణదుర్గంలో అమిలినేని తిరుగులేని విజయం
- శింగనమలలో ఊహించినట్లుగానే శ్రావణి విజయం
- తాడిపత్రిలో జేసీ వారసుడు అశ్మిత్ ఘన విజయం
- అనంతలో పసుపు జెండా పాతిన దగ్గుపాటి ప్రసాద్





సైకిల్ కూటమి సునామీలో అనంతలో అధికార పార్టీ గల్లంతైంది. ఉమ్మడి జిల్లాలో ఏ పార్టీకీ సాధ్యం కాని తిరుగులేని, చారిత్రక విజయాన్ని టీడీపీ కూటమి సొంతం చేసుకుంది. మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తమ ఖాతాలో వేసుకున్నాయి. ఒక దశలో గుంతకల్లు, ధర్మవరం, కదిరి, మడకశిర నియోజకవర్గాలలో ఒకటో రెండో వైసీపీ ఖాతాలోకి వెళుతున్నట్లు కనిపించాయి. కానీ అలాంటి అవకాశాన్ని ఓటర్లు ఏమాత్రం ఇవ్వలేదు. గంపగుత్తగా చంద్రన్నకు కానుకగా ఇచ్చేశారు. రాష్ట్ర విభజన తరువాత జరిగిన తొలి ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 12 స్థానాలను టీడీపీ గెలిచింది. 1994లో ఎన్టీఆర్ ప్రభంజనంలో ఒక్క తాడిపత్రి మినహా 13 అసెంబ్లీ స్థానాలను టీడీపీ, వామపక్ష కూటమి గెలిచింది. ఈ రికార్డులన్నింటినీ ఈ సార్వత్రిక ఎన్నికల్లో తుడిచిపెట్టుకుపోయాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం


అభిమానుల నడుమ పయ్యావుల కేశవ్..


పరిటాల సునీతకు శుభాకాంక్షల వెల్లువ..


కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు విజయ సంకేతం


విజయ సంకేతం చూపుతున్న గుంతకల్లు అభ్యర్థి గుమ్మనూరు..

అన్నీ సైకిల్ ఖాతాలోనే..

- రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత రెండో విజయాన్ని నమోదు చేసుకున్నారు. మెజార్టీ మాత్రం భారీగా సాధించారు. రెండుసార్లూ వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డిని ఓడించారు.
- అనంతపురం అర్బన్‌లో కొత్తగా బరిలో దిగిన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఘన విజయం సాధించారు. అనూహ్యంగా తెరపైకి వచ్చినా.. తిరుగులేని ఆధిక్యత సాధించారు. అనుభవజ్ఞుడైన అనంత వెంకటరామిరెడ్డిని ఓడించి సత్తా చాటుకున్నారు.
- ఉరవకొండలో పీఏసీ చైర్మన్, సిటింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఘన విజయం సాధించారు. ఎప్పుడూ ఉత్కంఠ రేపే ఇక్కడి ఫలితాలు ఈసారి ఏకపక్షంగా సాగాయి. ఉరవకొండలో గెలిస్తే పార్టీ అధికారంలోకి రాదన్న మూఢ నమ్మకాన్ని నియోజకవర్గ ఓటర్లు బద్ధలుకొట్టి మరీ కేశవ్‌ను గెలిపించడం విశేషం.
- కర్నూలు జిల్లా ఆలూరు నుంచి వలస వచ్చిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంను గుంతకల్లు ఓటర్లు అక్కున చేర్చుకున్నారు. అనూహ్యంగా టీడీపీ టిక్కెట్ దక్కించుకున్న ఆయన.. చాలా తక్కువ సమయంలోనే ఇక్కడి ఓటర్లకు చేరువయ్యారు.
- కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కొత్తగా బరిలో దిగిన అమిలినేని సురేంద్రబాబు శ్రమకు తగ్గ ఫలితాన్ని అందుకున్నారు. గెలిస్తే తాను ఏం చేస్తానో ప్రజలకు వివరిస్తూ.. ప్రచారంలో దూసుకుపోయిన ఆయనకు ఓటర్లు భారీ మెజార్టీని కానుకగా ఇచ్చారు.
- మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు పట్టుబట్టి మరీ రాయదుర్గం టిక్కెట్ తెచ్చుకున్నారు. తాను అక్కడి ప్రజలకే సేవచేస్తానని పార్టీ అధినేతను ఒప్పించారు. మరోమారు ఘన విజయం సాధించారు.
- జేసీ ప్రభాకర్ రెడ్డి వారసుడిగా గత ఎన్నికల్లో తొలిసారి బరిలో దిగిన అశ్మిత్ రెడ్డి 'ఒక్క చాన్స్' గాలిలో ఓడిపోయారు. ఐదేళ్లపాటు అనేక ఇబ్బందులు ఎదురైనా.. ధైర్యంగా ఎదుర్కొని నిలబడ్డారు. ఈ ఎన్నికల్లో తాడిపత్రి ప్రజలు తమ యువనాయకుడికి అండగా నిలిచి.. తొలిసారిగా అసెంబ్లీకి పంపుతున్నారు.
- 'మీ ఆడబిడ్డను.. ఆదరించండి..' అంటూ.. కాలికి బలపం కట్టుకుని తిరిగిన బండారు శ్రావణి శ్రీని శింగనమల ప్రజలు ఆశీర్వదించారు. తొలిసారి కాలం కలిసిరాకపోయినా, పార్టీ అధినేత ఆమెకు ఇంకో అవకాశం ఇచ్చారు. శ్రావణికి అన్ని వర్గాలు అండగా నిలిచి.. అసెంబ్లీలోకి దర్జాగా అడుగుపెట్టే అవకాశాన్ని ఇచ్చాయి.

(ఉమ్మడి జిల్లా ఎన్నికల వార్తలు 2, 6 పేజీల్లో..)

పోటాపోటీగా మెజార్టీలు

అనంతపురం నగరంలోని జేఎన్‌టీయూలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమైంది. ఏ క్షణానా వైసీపీ అభ్యర్థులకు కనీస ఊరట లభించలేదు. రాప్తాడు నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై 23,329 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతపురం అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డిపై 23,023 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉరవకొండలో పయ్యావుల కేశవ్ తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డిపై ఇది వరకు ఎన్నడూ లేని విధంగా ఏకంగా 21,704 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. రాయదుర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి మెట్టుగోవిందరెడ్డిపై 41,659 మెజార్టీని సాధించారు. జిల్లాలో ఇదే అత్యధిక మెజార్టీ కావడం విశేషం. కళ్యాణదుర్గం నుంచి అమిలినేని సురేంద్రబాబు తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్యపై 37,734 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తాడిపత్రి నుంచి జేసీ అశ్మిత్‌రెడ్డి 27,731 ఓట్ల మెజార్టీతో వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డిపై విజయం సాధించారు. శింగనమలలో బండారు శ్రావణి శ్రీ వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులుపై 8,788 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గుంతకల్లులో మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం వైసీపీ అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డిపై 6,826 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.



కూటమికి 54.32 శాతం ఓట్లు

జిల్లాలో 20.18 లక్షల ఓటర్లు ఉన్నారు. మే 13న నిర్వహించిన పోలింగ్‌లో 16,36,648 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో టీడీపీ అభ్యర్థులకు 8,89,119 ఓట్లు, వైసీపీ అభ్యర్థులకు 6,98,325 ఓట్లు వచ్చాయి. పోలైన ఓట్లల్లో 54.32 శాతం ఓట్లు టీడీపీ కూటమికి లభించాయి. వైసీపీ అభ్యర్థులకు 42.66 శాతం ఓట్లు దక్కాయి. మిగిలిన ఓట్లు ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు, నోటాకు వెళ్లాయి.

నియోజకవర్గాల వారిగా అభ్యర్థులకు దక్కిన ఓట్లు

నియోజకవర్గం	పోలైన ఓట్లు	టీడీపీ/శాతం	వైసీపీ /శాతం	మెజార్టీ	గెలుపు
రాయదుర్గం	2,27,248	130309 (57.34)	88650 (39.01)	41659	టీడీపీ
ఉరవకొండ	1,92,441	102046 (53.02)	80342 (41.7)	21704	టీడీపీ
తాడిపత్రి	2,06,703	113755 (55.03)	86024 (41.61)	27731	టీడీపీ
శింగనమల(ఎస్సీ	2,05,068	102957(50.20)	94169 (45.92)	8788	టీడీపీ
అనంతపురం అర్బన్	1,83,018	103334 (56.46)	80311 (43.88)	23023	టీడీపీ
కళ్యాణదుర్గం	2,05,143	118878 (57.94)	81144 (39.55)	37734	టీడీపీ
గుంతకల్లు	2,03,820	101700 (49.89)	94874 (46.54)	6826	టీడీపీ
రాప్తాడు	2,13,207	116140 (54.47)	92811 (43.53)	23329	టీడీపీ
	16,36,648	889119 (54.32)	698325 (42.66)	190794	

బాబు విజన్‌కు జై కొట్టిన ఓటర్లు

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్‌కే అనంత ఓటర్లు జై కొట్టారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని విస్మరించారు. బటన్ నొక్కుడుతోనే సరిపెట్టారు. ఈ పరిస్థితుల్లో కూటమి మెనిఫెస్టో అనంత ఓటర్లను ఆకట్టుకుంది. చంద్రబాబు అధికారం చేపడితేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మెజార్టీ ఓటర్లు భావించారు. దీంతో కూటమి అభ్యర్థులు భారీ విజయాలను నమోదు చేసుకున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ విజయోత్సాహం


కౌంటింగ్ కేంద్రంలో కలెక్టర్, జేసీ పరిశీలన

వైసీపీలో నైరాశ్యం

- పార్టీ జిల్లా కార్యాలయానికి కంచె

అనంతపురం క్రైం, జూన్ 4: సైకిల్ సృష్టించిన సునామీకి వైసీపీ కుదేలైంది. ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే సీటూ రాకపోవడంతో ఆ పార్టీ శ్రేణులు కిక్కురుమనలేదు. అధికార పార్టీ అభ్యర్థులు ఈ పరిణామాలను ఊహించలేకపోయారు. టీడీపీ ప్రభంజనాన్ని చూసి నాయకులు, కార్యకర్తలు షాక్‌కు గురయ్యారు. గట్టి పోటీ తప్పదని భావించామని, కానీ ఈ స్థాయిలో ఉంటుందని అనుకోలేదని అంటున్నారు. పోలింగ్ కేంద్రం నుంచి మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ 11 గంటలకే వెళ్లిపోయారు. అనంతపురం నగరంలోని రెండో రోడ్డులో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయంలో నిశ్శబ్దం రాజ్యమేలింది. కార్యాలయానికి తాళం వేశారు. ఎవరైనా దాడి చేస్తారనే ఉద్దేశంతో పోలీసులకు చెప్పి అక్కడ ఇనుప కంచె వేయించారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


వైసీపీ కార్యాలయానికి కంచె..

ఏ గొడవా లేదు..!

ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

అనంతపురం క్రైం, జూన్ 4: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ సందర్భంగా హింస చెలరేగడంతో పోలీసులు మునుపెన్నడూ లేనంత భద్రత కల్పించారు. జిల్లా వ్యాప్తంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలున్న జేఎన్టీయూ పరిసరాల్లోకి అనుమతి లేనిదే ఏ ఒక్కరూ వెళ్లలేనంత భద్రత ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా డీఐజీ షేముషి, ఎస్పీ గౌతమి శాలి చర్యలు తీసుకున్నారు. కౌంటింగ్‌కు ముందు జిల్లా వ్యాప్తంగా వందలాది మందిపై రౌడీషీట్లు తెరిచారు. ఘర్షణలకు పాల్పడితే జైలుకు వెళ్లక తప్పదన్న హెచ్చరికలు జారీ చేశారు. వేలాది మందిని బైండోవర్ చేశారు. దీనికితోడు ఫలితాలు ఏకపక్షంగా రావడంతో వైసీపీ వర్గీయులు డీలా పడిపోయారు.

మీ సహకారానికి కృతజ్ఞతలు: కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 4: కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా యంత్రాంగం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. జేఎన్‌టీయూలోని కౌంటింగ్ కేంద్రంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నెలరోజులుగా కౌంటింగ్ పక్రియలో ఆర్వోలు, నోడల్ అధికారులు, ఏఆర్వోలు, సూపర్‌వైజర్లు, పోలీస్ అధికారులు ఎంతో శ్రమించారని అన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కూడా అన్ని విధాలా సహకరించారని అన్నారు. అందరి సహకారం వల్లనే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా ముగిసిందని అన్నారు.

నిశ్శబ్దం.. జయకేతనం..!

ఉదయం.. సాయంత్రం.. నగరంలో భిన్న వాతావరణం

అనంతపురం సిటీ, జూన్ 4: కౌంటింగ్ నేపథ్యంలో నగరంలో పోలీసు యంత్రాంగం మంగళవారం 144 సెక్షన్ విధించింది. దీంతో ప్రజలందరూ ఫలితాలను వీక్షిస్తూ ఇళ్లలోనే ఉండిపోయారు. దుకాణాలు, హోటళ్లు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్‌లోనూ పెద్దగా ప్రయాణికులు కనిపించలేదు. ఆటోలు కూడా తిరగలేదు. నిత్యం వాహనాలు, జన సంచారంతో కిటకిటలాడే బళ్లారి బైపాస్, సప్తగిరి సర్కిల్, పాతూరు, సంఘమేశ్వర సర్కిల్, రాంనగర్, రుద్రంపేట బైపాస్.. ఇలా అన్ని ప్రాంతాలు బోసిపోయాయి. కానీ ఉదయం 11 గంటలు దాటాక వాతావరణం పూర్తిగా మారిపోయింది. టీడీపీ కూటమికి రాష్ట్ర వ్యాప్తంగా అనుకూల ఫలితాలు రావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చారు. ఎక్కడ చూసినా సందడి కనిపించింది. వైసీపీ వర్గీయులు మాత్రం నగరంలో ఎక్కడా కనిపించలేదు. శాంతిభద్రతల పరంగా ఎలాంటి సమస్య తలెత్తలేదు. దీంతో 144 సెక్షన్ అమలులో ఉన్నా.. ఆనందాన్ని పంచుకునేందుకు అక్కడక్కడ జనం కలుసుకున్నారు.


శ్రావణిపై అభిమానం..

హోరెత్తిన నగరం..

టీడీపీ కూటమి ప్రభజనంతో కార్యాకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రజలు సాయంత్రం పెద్దఎత్తున నగరంలోకి వచ్చి సందడి చేశారు. జనసేన, టీడీపీ కార్యర్తలు పార్టీ జెండాలతో బైకులపై తిరుగుతూ నినాదాలు చేశారు. మరికొందరు తమ తమ కాలనీల్లో టపాసులు పేల్చి సంబరాలు చేశారు. మహిళలు సైతం చిందులు వేశారు.

అభ్యర్థుల ఇంట సందడే సందడి..

టీడీపీ కూటమికి భారీ విజయం దక్కడంతో నగరంలోని ఎమ్మెల్యే అభ్యర్థుల ఇళ్ల వద్ద సందడి కనిపించింది. పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్, పయ్యావుల కేశవ్, అమిలినేని సురేంద్రబాబు ఇళ్ల వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. యువకులు బైకులతో హోరెత్తించారు. జై టీడీపీ, జై జనసేన, జై బీజేపీ అంటూ నినాదాలు చేశారు. అభ్యర్థులను అభినందించేందుకు కార్యకర్తలు పోటీపడ్డారు.


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న పరిటాల సునీత


ఆర్‌ఓ నుంచి డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న పయ్యావుల కేశవ్


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న కాలవ శ్రీనివాసులు


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న గుమ్మనూరు జయరాం


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న జేసీ అశ్మిత్‌రెడ్డి


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న అమిలినేని సురేంద్రబాబు

ప్రభంజనం

ఏపీ తీర్పు @ 2024

అనంత కోటలో దగ్గుపాటి పాగా

23,023 ఓట్ల మెజార్టీతో ఘన విజయం

అనంతపురం క్రైం, జూన్ 4: అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గెలుపొందారు. తొలి సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీలో విజయఢంకా మోగించారు. వెంకటేశ్వరప్రసాద్‌కు 1,03,334ఓట్లు, వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డికి 80,311ఓట్లు పోలయ్యాయి. కూటమి అభ్యర్థి వెంకటేశ్వర ప్రసాద్ 23023 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఎంపీపీగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి ఎమ్మెల్యేగా మరో మెట్టు ఎక్కారు. కాగా ప్రతి రౌండులోనూ దగ్గుపాటి ప్రసాద్ ఆధిపత్యం కొన సాగించడం విశేషం. పోలింగ్‌కు కేవలం 45రోజుల ముందు అనంత పురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అడుగుపెట్టిన ఆయన అతి తక్కువ సమయంలోనే టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు జనసేన, బీజేపీ కూటమి శ్రేణులతో మమేకమయ్యారు. అంద రినీ సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రచారంలో దూసుకుపోయారు. ఇదే స్థాయిలో అనంత ప్రజలు ఆయనను భారీ మెజార్టీతో గెలిపించారు. జేఎన్టీయూలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్‌తో డిక్లరేషన్ అందుకున్న ప్రసాద్ నగర వీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన వెంట భారీగా టీడీపీ, కూటమి శ్రేణులు తరలివచ్చాయి.

అనంత ప్రజలకు రుణపడి ఉంటా



నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన అనంత పురం నియోజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటా. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తా. ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

గుంతకల్లు సెంటిమెంట్ యథాతథం

గుంతకల్లు, జూన్4: రాష్ట్రంలో ఏ పార్టీ గెలిస్తే అదే పార్టీ అభ్యర్థి గుంతకల్లు నియోజకవర్గంలో కూడా గెలుస్తాడన్న సెంటిమెంటు మరో సారి కొనసాగింది. టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచీ అన్ని ఎన్నికల్లోనూ రాష్ట్రంలో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అభ్యర్థే గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో విజయం సాధిస్తూ వస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి దాకా తొమ్మిది ఎన్నికల్లోనూ అదే సెంటిమెంటు కొనసాగింది. పదో సారి జరిగిన ఈ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో టీడీపీ, గుంతకల్లులో టీడీపీ అభ్యర్థి అయిన గుమ్మనూరు జయరాం గెలుపు సాధించారు. గుమ్మనూరు జయరాం స్థానికుడు కాదని, ఆయన ఎమ్మెల్యే అయితే దౌర్జన్యాలు పెరుగుతాయని వైసీపీ నాయకులు అదేపనిగా ప్రచారం చేసినా ఓటర్లు పెడచెవిన పెట్టి టీడీపీకి జైకొట్టారు. జయరాం 9300 ఓట్ల మెజారిటీతో గెలుపు సాధించారు. దీంతో మరోసారి గుంతకల్లులో సెంటిమెంటు వర్కవుట్ అయ్యింది. అలాగే ఇతర నియోజకవర్గాల నుంచి వలస వచ్చి గుంతకల్లులో టీడీపీ తరఫున ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులు మొదటి ప్రయత్నంలోనే గెలుపు సాధించిన రికార్డు కూడా ఈసారి పదిలంగా నిలిచింది. కర్నూలు జిల్లాకు చెందిన వారైన టీడీపీ నుంచి 1983లో పత్తి రాజగోపాల్, 1984లో గాదిలింగప్ప మొదటి ప్రయత్నంలోనే విజయాలను అందుకున్న వారిలో ఉన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన అరికెరి జగదీశ్ కర్నూలు జిల్లా నుంచి వచ్చి కాంగ్రెస్ తరఫున, పక్క నియోజకవర్గం నుంచి వచ్చిన వై వెంకట రామిరెడ్డి వైసీపీ తరఫున పోటీచేసి తొలి యత్నంలో విఫలం చెందారు. రెండవ ప్రయత్నంలో గెలుపు సాధించారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలుపు సాధించింది లేదు. వెంకటరామిరెడ్డి ఓటమితో ఆ రికార్డు కూడా పదిలంగా నిలిచింది.

అనంత ఎంపీగా అంబికా

● 1,88,555 ఓట్ల భారీ మెజార్టీతో విజయం



అనంతపురం అర్బన్, జూన్ 4: అనంతపురం ఎంపీగా టీడీపీ కూటమి అభ్యర్థి అంబికా లక్ష్మీ నారాయణ ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర నారాయణపై ఆయన 1,88,555 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. జేఎన్‌టీయూలో మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో ప్రతి రౌండ్ లోనూ ఆయన ఆధిపత్యం కనబర్చారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కలిపి.. తుది ఫలితం వెలువడేందుకు రాత్రి అయింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ ఆయనకు డిక్లరేషన్ ఫాంను అందజేశారు. ఈ సందర్భంగా తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు అంబికా లక్ష్మీనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తాను ఇచ్చిన హామీ మేరకు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. కరువు జిల్లా అనంతకు కేంద్రం నుంచి విరివిగా నిధులు తెస్తానని, జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.


నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీవీ

యువనేతకు అభినందనలు

మంగళగిరిలో విజయం సాధించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు కలిసి అభినందనలు తెలిపారు. యువగళం, సార్వత్రిక ఎన్నికలు, పార్టీ కార్యక్రమాల్లో తాను చేసిన కృషిని నారా లోకేశ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకుని అభినందించారని బీవీ తెలిపారు.

కాలవకు రికార్డు మెజార్టీ

రాయదుర్గం, జూన్ 4: కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు 41,659 ఓట్ల ఆధిక్యతతో గెలుపు సాధించారు. మొత్తం 2,27,784 ఓట్లు పోలవగా వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డికు 88,165 ఓట్లు వచ్చాయి. కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులుకు 1,29,307 ఓట్లు దక్కాయి. దీని ప్రకారం 41,142 ఓట్ల ఆధిక్య ఈవీఎంల ద్వారా కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులుకు దక్కింది. 1,532 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగగా అందులో 1002 ఓట్లు కూటమి అభ్యర్థికి, 485 ఓట్లు వైసీపీ అభ్యర్థికి వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో కూడా 517 ఓట్లు కాలవ శ్రీనివాసులు ఆధిక్యత సాధించారు. దీంతో మొత్తం ఆధిక్యత 41,659కి చేరింది. రాయదుర్గం పట్టణంలోనే కాలవ శ్రీనివాసులకు 15,981 ఓట్ల మెజార్టీ దక్కింది. డీ.హీరేహాళ్ మండలంలో 4,664, బొమ్మనహాళ్‌లో 6,689, కణేకల్లు లో 5,253, రాయదుర్గం మండలంలో 4,150, గుమ్మఘట్ట మండలంలో 4,430 ఓట్ల ఆధిక్యత కాలవ శ్రీనివాసులుకు దక్కింది. రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటివరకు 18 సార్లు ఎన్నికలు జరుగగా 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కాపు రామ చంద్రారెడ్డికి 32,476 ఓట్ల రికార్డు మెజార్టీ దక్కింది. ఇప్పుడు ఆ రికార్డును కాలవ శ్రీనివాసులు 41,659 ఓట్ల మెజార్టీతో బద్దలు కొట్టారు.

నాన్న, పెదనాన్నకు సాధ్యం కాని మెజార్టీ

తాడిపత్రిటౌన్, జూన్ 4: తాడిపత్రి అసెంబ్లీ సెగ్మెంట్ ఏర్పడినప్పటి నుంచి చరిత్రలో ఎన్నడూలేనివిధంగా అత్యధిక మెజార్టీతో టీడీపీ విజయం సాధించింది. టీడీపీ తరఫున పోటీ చేసిన జేసీ అస్మిత్ రెడ్డి తన తండ్రి, పెదనాన్నకు సాధ్యం కాని మెజార్టీని ఈ ఎన్నికల్లో సాధించారు. జేసీ అశ్మిత్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఓడిపోయినా నిరుత్సాహపడకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశాడు. పెద్దనాన్న జేసీ దివాకర్‌రెడ్డి, నాన్న జేసీ ప్రభాకర్‌రెడ్డి, సోదరుడు జేసీ పవన్‌రెడ్డి ఆశీర్వాదాలతో ఎన్నికల ప్రచారంలో దూసుకుపోయారు. పెద్దవడుగూరు మండలం నుంచి ఫలితాల వెల్లడి ప్రారంభమైంది. అక్కడ వైసీపీకి మెజార్టీ వస్తుందనుకున్నా టీడీపీకి మెజార్టీ రావడం గమనార్హం. గత ఎన్నికల్లో పెద్దవడుగూరు మండలంలో వైసీపీకి 6వేలకు పైగా మెజార్టీ వచ్చింది. ప్రస్తుతం అక్కడి నుంచి టీడీపీకి 400పైగా మెజార్టీ వచ్చింది. పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలం, తాడిపత్రి పట్టణంలో ఆశించిన స్థాయిలో మెజార్టీ వచ్చింది. టీడీపీ అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డికి 1,13,755 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి పెద్దారెడ్డికి 86024 ఓట్లు వచ్చాయి. మొత్తం పోస్టల్‌బ్యాలెట్‌తో కలిపి 29068 ఓట్ల మెజార్టీ వచ్చింది.

ప్రతి రౌండ్‌లో అమిలినేనికే ఆధిక్యం

కళ్యాణదుర్గం, జూన్ 4: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు భారీ మెజార్టీతో గెలవడం పట్ల టీడీపీ కార్యకర్తలు కళ్యాణదుర్గంలో పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ప్రతి రౌండ్‌లోను అమిలినేనికే ఆధిక్యత వచ్చింది. 19 రౌండ్‌లలోను అమిలినేనికి మెజార్టీ లభించింది. దీంతో ఆయన 37734 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు 118878 ఓట్లు పడగా, వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్యకు 81144 ఓట్లు పడ్డాయి.


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న శ్రావణిశ్రీ

శ్రావణి గెలుపులో ఆ రెండు మండలాలు..

బుక్కరాయసముద్రం, జూన్ 4: శింగనమల నియోజకవర్గంలో టీడీపీ గెలుపులో బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాలు కీలకపాత్ర పోషించినట్లు స్పష్టం అవుతోంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అత్యధికంగా బుక్కరాయసముద్రం మండలం నుంచి 6917 మెజార్టీ వచ్చింది. గార్లదిన్నె మండలం నుంచి 2350 ఓట్ల మెజార్టీ లభించింది. శింగనమల నుంచి 1972, నార్పల నుంచి 1323 ఓట్ల మెజార్టీ వచ్చింది. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వైసీపీకి 4500పైగా ఆధిక్యం లభించింది. ఇక పోస్టల్ బ్యాలెట్‌లో టీడీపీ కూటమి అభ్యర్థికి 580 అధిక్యత సాధించింది.

● టీడీపీ అభ్యర్థి శ్రావణిశ్రీ స్వగ్రామమైన బుక్క రాయసముద్రం మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో 772 ఓట్లు మెజార్టీ సాధించింది. దీంతో ఆ గ్రా మంలోని ప్రజలు ,టీడీపీ కార్యకర్తలు భారీగా సంబరాలు నిర్వహించారు.

ఉరవకొండలో టీడీపీ జయకేతనం

ఉరవకొండ: ఉరవకొండ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ విజయఢంకా మోగించా రు. 11మంది బరిలో నిలవగా మొత్తం 1,92,441 ఓట్లు పోల్ అయ్యాయి. 88.78శాతం పోలింగ్ నమోదైంది. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ 21,704 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పయ్యావుల కేశవ్‌కు 1,05,500ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డికి 79,746 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థికి 4,485, నోటాకి 1895 ఓట్లు వచ్చాయి. మొత్తం 15రౌండ్ల లెక్కింపులో 14 రౌండ్లు కేశవే ఆధిక్యం కనబరిచారు. ఐదో రౌండ్‌లో మాత్రమే వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డికి 147ఓట్లు అధికంగా వచ్చాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ టీడీపీ హవా కొనసాగింది. ఎన్నికల్లో విజయం సాధించిన పయ్యావుల కేశవ్‌కు ఆర్వో కేతన్‌గార్గ్ నుంచి డిక్లరేషన్ ఫాంను అందుకున్నారు. అనంతరం అనంతపురంలోని రాంనగర్‌లో ఉన్న కేశవ్ ఇంటి వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో కేశవ్ వద్ద కోలాహలం నెలకొంది.

జగన్‌కు చావుదెబ్బ



అనంతపురం విద్య, జూన్ 4: వైసీపీ అధినేత జగన్‌ను రాష్ట్ర ప్రజలు చావుదెబ్బ కొట్టారు. జగన్ ప్రభుత్వం చేసిన అవినీతి, అప్రజాస్వామిక చర్యలను, అభివృద్ధి నిరోధక చర్యలను, వైసీపీ నేతల అధికార దుర్వినియోగాన్ని ప్రజలు ఓర్చుకోలే కపోయారు. జగన్ వైఖరిని, వైసీపీ అభ్యర్థులను ఏపీ ప్రజలు వ్యతిరేకిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు హర్షణీయం. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పరుగులు పెడుతుందని ఆశిస్తున్నా.

- సీపీఐ జగదీష్

పండగే... పండగ..!



కూటమి విజయంతో కాసుల వర్షం... ధూం..ధాం చేసిన పందెంరాయుళ్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 4: ప్రజల నాడిని పసిగట్టారేమో..! లేక ప్రభుత్వ వ్యతిరేకతను అంచనా వేశారో? ఎన్నికల్లో కూటమి గెలుస్తుందని పందెం కాశారు. వారి అంచనా నిజమైంది. కాసుల వర్షం కురిసింది. దీంతో ధూం...ధాం.. చేశారు. ఇందుకు తపోవనం సర్కిల్ వేదికైంది. ఆ ప్రాంతంలో నివాసముంటున్న కూటమికి చెందిన ఓ ఐదుగురు యువకులు నెల రోజుల ముందే కూటమి గెలుస్తుందని పందెం కాశారు. అందులో కొందరు యువకులు మధ్యలో వద్దని నిరాకరించినప్పటికీ... మెయిన్ లీడ్ తీసుకున్న ఓ యువకుడు మీరు నమ్మండి కూటమే గెలుస్తుంది... లేదంటే మీ డబ్బును నేనే ఇస్తానంటూ గెలుపుపై నమ్మకం ఉంచాడు. నెలరోజులు ముందుగానే రూ. 22 లక్షలు పందెం కాసిన వారి చేతుల్లో పెట్టేశాడు. మంగళవారం విడుదలైన ఎన్నికల ఫలితాల్లో కూటమి సునామీని సృష్టించింది. దీంతో ఉదయం 11.30 గంటలకే పందెం కాసిన ప్రత్యర్థులు మొత్తం సొమ్ము విజేతలకు అందజేశారు. దీంతో ఆ యువత పట్టారాని ఆనందంలో మునిగిపోయారు. ఓ వైపు కూటమి విజయం.. మరోవైపు బెట్టింగ్‌లో విజయం సాధించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వచ్చిన బెట్టింగ్ లాభంలో దాదాపు రూ. 4 లక్షల వరకూ ఆ యువకులతో పాటు... వారి స్నేహితులు, పరిసర ప్రాంతాల వారికి బిర్యానీ, మందు పార్టీ ఇచ్చి ధూం.. ధాం చేసినట్లు సమాచారం.

అక్కడ వైసీపీకి ఒకే ఒక్క ఓటు



హిందూపురం, జూన్ 4: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి 28వ బూత్‌లో వచ్చిన ఓట్లను చూసి ఓట్లు లెక్కిస్తున్న సిబ్బందే అవాక్కయ్యారు. ఎందుకంటే ఈ బూత్‌లో వైసీపీకి ఒక్క ఓటే పడింది. టీడీపీకి 95 ఓట్లు రాగా, నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ అభ్యర్థికి 440 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి మైనార్టీ వర్గానికి చెందిన వాడు అయినా పట్టణంలో మైనార్టీ బూత్‌లలో కూడా ఎక్కడా ఆయనకు అన్ని ఓట్లు రాలేదు. అయితే ఏ రకంగా అవగాహన కల్పించారో కానీ చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ఆయనకు 440 ఓట్లు వేశారు. వైసీపీకి మాత్రం ఒక్కటంటే ఒక్క ఓటు మాత్రం వేశారు. ఇదే బూత్ పరిధిలో అధికార పార్టీకి చెందిన నాయకుడి కుటుంబ సభ్యుల ఓట్లు ఉన్నాయి. అయినా వైసీపీకి ఇక్కడ ఒక్క ఓటు రావడం అంటే ఏమనుకోలో.. !

తోపుదుర్తి మీసం కొరిగించుకుంటాడా ?

పాత ఇంటర్వ్యూలోని మాటలు సోషల్ మీడియాలో వైరల్

అనంతపురం సిటీ, జూన్ 4: అధికారంలో ఉన్నప్పుడు స్పృహ లేకుండా చేసే సవాళ్లు, అధికారం కోల్పోతే ఎంతలా ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారుతాయో చెప్పే సంఘటన ఇది. కొన్ని రోజుల కిందట రాప్తాడు ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. ఆ ఇంటర్వ్యూలో ఆయన 2024లో జరిగే ఎన్నికల్లో ఓడిపోతే మీసం కొరిగించుకుంటా అని ఎటువంటి ఆలోచన లేకుండా అన్నారు. దీంతో ఇంటర్వ్యూ చేస్తున్న రిపోర్టర్ ఆలోచన చేసి మాట్లాడండి ఈ వీడియో రికార్డు అవుతుంది అని కూడా హెచ్చరించారు. కానీ ఆయన ఏమాత్రం ఖాతరు చేయకుండా పరిటాల సునీత ఎమ్మెల్యేగా గెలిస్తే.. మీసం తీయించుకుంటానని మరోసారి చెప్పడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. అయితే తాజా ఎన్నికల్లో రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత గెలవడంతో ప్రకాష్‌రెడ్డి అప్పుడు చెప్పిన మాటకు కట్టుబడి మీసం కొరిగించుకుంటారా అని టీడీపీ కార్యకర్తలు అంటున్నారు. ఈ నేపథ్యంలోనే నాటి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.


ఇంటర్వ్యూలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (ఫైల్)

హిస్టరీ రిపీట్

25 ఏళ్ల తర్వాత సెంటిమెంట్‌కు బ్రేక్... 1994 ఫలితాలు పునరావృతం



ఉరవకొండ, జూన్ 4: ఉరవకొండ నియోజకవర్గంలో 25ఏళ్లుగా కొనసాగుతున్న సెంటిమెంట్‌కు బ్రేక్ పడింది. ఇక్కడ ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే, ఆపార్టీ అధికారంలోకి రాదనే సెంటిమెంట్ ఉండేది. అయితే కూటమి సునామితో ఈసారి ఆ సెంటిమెంట్ పటాపంచలైపోయింది. 1994 ఫలితాలు 2024లో పునరావృతమయ్యా యి. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ 1994లో రాజకీయ రంగప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో శివరామిరెడ్డి కాంగ్రెస్ టిక్కెట్ ఆశించగా ఆయనకు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ తరఫున దరూరు పుల్లయ్య పోటీ చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా శివరామిరెడ్డి బరిలో నిలిచారు. ఆయనపైన పయ్యావుల కేశవ్ 17,691 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తర్వాత 1999లో టీడీపీ అభ్యర్థిగా పయ్యావుల కేశవ్, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా శివరామిరెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో శివరామిరెడ్డి 8వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి రాదనే సెంటిమెంట్ ఉండేది. ఆ ఎన్నికల్లో శివరామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలవగా, ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి 2019వరకూ ఆ ఆనవాయితీ కొనసాగుతూనే వచ్చింది. 2004-2009 ఎన్నికల్లో ఉరవకొండ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలుపొందగా ఆ ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి గెలవగా ఆ ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2019లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ గెలవగా వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. దీంతో ఈ ఎన్నికల్లో ఉరవకొండలో ఏపార్టీ గెలుస్తుందో, ఆపార్టీ అధికారంలోకి రాదని అంతా భావించారు. కానీ 25ఏళ్ల తర్వాత ఆ సెంటిమెంట్‌కు బ్రేక్ పడింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ 21,704 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

అమెరికాలో ఎన్‌ఆర్‌ఐల సంబరాలు

పుట్లూరు, జూన్ 4: టీడీపీ కూటమి భారీ విజయంతో మండలానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు అమెరికాలోని సౌత్‌కరోలినా రాష్ట్రంలోని ఫార్మిల్‌సిటీలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించుకుంటూ టీడీపీకి జై కొట్టారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాప్తాడు, మడకశిర, శింగనమల నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపుతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు పురుషోత్తంచౌదరిగూడే, పొత్తూరి రవినాయుడు, వెంకట్ మాలపాటి, నరసింహ, వాసిరెడ్డి, సాచి ఆవులపాటి, వెంకట్ సూర్యదేవర, నాగేంద్ర, మధుకర్, ప్రదీప్ పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఐలు

దెబ్బకొట్టిన టీచర్లు

అనంతపురం విద్య, జూన్ 4: జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు ఇబ్బందులు పడిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఓటు ద్వారా తమ ఆగ్రహాన్ని చూపించారు. పోస్టల్ బ్యాలెట్‌తో పాటు తమ కుటుంబికుల ఓట్లు గంపగుత్తగా కూటమి అభ్యర్థులకు వేయించారు. అభ్యర్థుల మెజార్టీ చూస్తే ఇదే అర్థం అవుతోంది. 2019లో అధికారంలోని వచ్చినప్పటి నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులే టార్గెట్ అన్నట్టుగా జగన్ వేధించారు. ఉపాధ్యాయులను కరోనా వంటి కష్ట సమయంలో కూడా నాడు-నేడు పనుల కోసం స్కూళ్లలో ఉండాలంటూ ఆదేశాలిచ్చారు. అంతేకాకుండా మద్యం దుకాణాల వద్ద కూడా కాపలాకాయించారు. అక్కడితో ఆగకుండా స్కూళ్లలో మరుగుదొడ్ల ఫొటోలు కూడా తీయించారు. ఫేషియల్ యాప్స్ అంటూ ఉదయమే పరుగులు పెట్టించారు. 117 జీవో అంటూ ప్రైమరీ స్కూళ్లను సైతం సర్వనాశనం చేసేలా అశాస్త్రీయమైన నిర్ణయాలు తీసుకొచ్చాడు. ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హెచ్చరించినా...ఎవరి మాటలు వినకుండా 117 జీవోలతో ప్రైమరీ స్కూళ్లను విలీనం చేశారు. ఉపాధ్యాయులు ఎన్నిసార్లు హెచ్చరించినా వినకుండా 3,4,5 క్లాసులను విలీనం చేసి ఉపాధ్యాయులను ఒకవైపు, విద్యార్థులను మరో వైపు అన్నట్టుగా వెంటాడారు. దీంతో ఉపాధ్యాయులు కసిగా ఎన్నికల కోసం వేచి చూశారు. ఎన్ని అవమానాలు చేసి, ఎన్నిసార్లు చీదరించినా గురువులు మౌనంగా భరిస్తూ వచ్చారు. ఎన్నికల కోసం ఎదురు చూశారు. మే మొదటివారం రాగానే.పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం ఉపాధ్యాయులు క్యూ కట్టారు. కనీవినీ ఎరుగని విధంగా అనంతపురం జిల్లా వ్యాప్తంగా 26,900 ఓట్లు వేశారు. అంతే స్థాయిలో మే 13న సైతం ఉపాధ్యాయులు, వారి కుటుంబీకులు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టి.....కూటమికి జై కొట్టారు. ఫలితాల్లో కూటమికి నేతలు విజయం సాధిస్తుంటే అయ్యవార్లు సంబరపడ్డారు. ఇదే కాదా ! మనం కోరుకుంది అంటూ సంబరపడ్డారు. జగన్‌కు టీచర్స్ దెబ్బ ఎంటో రుచి చూపించాం అంటూ ఆనందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పదును చూపిన ప్రజల విజ్ఞత

ఉత్కంఠకు, ఆకాంక్షలకు తగ్గట్టుగానే, ఎన్నికల ఫలితాలు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఉక్కపాదాల నుంచి, ఉక్కపోతల నుంచి, దుష్పరిపాలనల నుంచి ఉపశమనం కలిగించాయి. ఆగ్రహానికి, నిరాదరణకు పాత్రులైన నాయకులను, వారి ప్రభుత్వాలను నిర్దాక్షిణ్యంగా ప్రజారంగం నుంచి నెట్టివేశాయి. తిరుగులేని, ఎదురులేని నాయకులనుకున్న వారి ఒడ్డూపొడువూ కత్తిరించి బుద్ధి చెప్పాయి. 2024 ప్రజల తీర్పు భారత రాజకీయరంగాన్ని తిరిగి సంచలనశీలంగా మార్చింది. పదేళ్ల ఏకపక్ష పాలన స్థానంలో తిరిగి సంకీర్ణ రాజకీయాలను ప్రవేశపెట్టింది. జాతీయ రంగస్థలం మీద తెలుగువారి ప్రమేయానికి పట్టం కట్టింది.

భారతీయ జనతాపార్టీకి మెజారిటీ బహుదూరంలోనే నిలిచిపోయింది. ఎన్‌డీఏలోని భాగస్వామ్యపక్షాల సహకారంతో మాత్రమే తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి సాగనంపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని ఘనవిజయం సాధించింది. కేంద్రంలోని కొత్త ప్రభుత్వంలో తెలుగుదేశం, ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించనున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు నిరుత్సాహకరమైన ఫలితాలు వచ్చాయి. గత లోక్‌సభలో నాలుగు స్థానాలు పొందిన తెలంగాణ బీజేపీ తన బలాన్ని రెట్టింపు చేసుకుంది. గత సభలో మూడు స్థానాల బలమే ఉన్నప్పటికీ, ఇటీవల రాష్ట్రంలో అధికారం పొందినందున, మెరుగైన ఫలితాలు సాధించవలసిన కాంగ్రెస్ తన సంఖ్యను ఎనిమిదికి మించి పెంచుకోలేకపోయింది.

వైసీపీ ప్రభుత్వం ఘోరపరాజయం పూర్తిగా స్వయంకృతం. ప్రత్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఏకరువు పెట్టిన జగన్ ప్రభుత్వ దుర్మార్గాలకంటే, ప్రజల అనుభవంలోకి వచ్చినవి కొన్ని రెట్లు ఎక్కువ అని ఈ ఫలితాలు చెబుతున్నాయి. వైసీపీ ని అనేక జిల్లాలనుంచి ఏకమొత్తంగానూ తుడిచిపెట్టారంటే, దుష్పరిపాలన తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. రెండంకెల సంఖ్యకు కూడా చేరుకోలేక కునారిల్లుతూ, ప్రతిపక్ష స్థాయి కూడా దక్కనంత స్వల్పమైన ఉనికి మిగిలిన ఆ పార్టీ తన దుస్థితికి కారణాలను సమీక్షించుకుని సుదీర్ఘ కాలం నిరీక్షించవలసిందే.

కూటమి 21 లోక్‌సభ స్థానాలను సాధించగా, అందులో తెలుగుదేశం సొంతంగా 16 స్థానాలు సంపాదించింది. కేంద్రంలో మెజారిటీ కొరవడిన బీజేపీకి టీడీపీ ఇప్పుడు అత్యంత అవసరమైన, కీలకమయిన భాగస్వామి. బీజేపీ తరువాత అత్యధిక స్థానాలు సాధించిన ఎన్‌డీఏ భాగస్వామి తెలుగుదేశమే. గత రెండు పదవీకాలాల్లో కూడా పేరుకు ఎన్‌డీఏ ప్రభుత్వమే అయినా, తనకు సొంతంగా మెజారిటీ ఉన్నందున నామమాత్రపు సంకీర్ణంగా మాత్రమే వ్యవహరించిన బీజేపీ, ఈసారి అనివార్యంగా భాగస్వామిక రాజకీయాలను అంగీకరించవలసి వస్తుంది. తెలుగుదేశంపార్టీకి, బిహార్‌కు చెందిన జనతాదళ్ యునైటెడ్‌కు వాస్తవ అర్థంలో తగినప్రాధాన్యం విధిగా ఇవ్వవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి విషయంలో అలక్ష్యం చూపుతున్నందుకు, బీజేపీ ఇతర విధానాలపై నిరసనగానూ గతంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి వెలుపలికి వచ్చిన తెలుగుదేశం పార్టీకి, ప్రస్తుత విజయాలు మంచి సానుకూలతను సమకూర్చాయి. రాజధాని, పోలవరం వంటి అభివృద్ధి అంశాల మీద కేంద్రం నుంచి తగిన స్పందనను రాబట్టగలిగే శక్తి టీడీపీకి ఇప్పుడున్నది. చంద్రబాబు నాయుడుకు ఉన్న అపారమైన అనుభవం, కార్యదక్షత వల్ల జాతీయ రంగంలో కూడా ఆయన క్రియాశీల బాధ్యతలు నిర్వహించగలరని, బీజేపీ ప్రభుత్వం దూకుడుకు కళ్లెం వేయగలిగేది కూడా చంద్రబాబేనని ఆశాభావాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీ ఎనిమిది విజయాలను, బీఆర్ఎస్ సున్నా స్కోర్‌తో కలిపి చూస్తేనే తెలంగాణ ఫలితాలు అర్థమవుతాయి. గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజిత బీఆర్ఎస్‌కు వచ్చిన సుమారు 37 శాతం ఓట్లు పార్లమెంటు ఎన్నికలలో ఎవరికి మళ్లుతాయన్న చర్చ జరుగుతూ వచ్చింది. గణనీయభాగం బీజేపీకి పోయినట్టు అర్థమవుతోంది. కేంద్రంలో మహాబలంతో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే, ఈ గెలుపులు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇబ్బందులు కలిగించి ఉండేవి. ఇప్పుడు, పరిమిత బలం కలిగిన కేంద్రమే ఉంటుంది కాబట్టి, తక్షణ ప్రమాదం లేదు కానీ, పరిస్థితిని మెరుగుపరుచుకోకపోతే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు కూడా ఇబ్బందులే ఎదురవుతాయి.



తెలుగు రాష్ట్రాల పరిణామాలకు మించిన ప్రాధాన్యం కలిగినవి, దేశ రాజకీయాల గతినే మార్చగలిగేవి పదిహేడో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు. తెలంగాణలో బీజేపీ, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించాయి కానీ, జాతీయస్థాయిలో బీజేపీకి తీవ్రమైన ఎదురుదెబ్బలు తగిలాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో ఆ పార్టీ కొత్తగా అధికారంలోకి రాగలుగుతోంది, మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలోనూ ఘనవిజయాలు సాధించింది. కేరళ వంటి రాష్ట్రంలో ఒక స్థానం గెలవగలిగింది. ఈ విజయాలన్నిటి కంటె, మెజారిటీ ఎదురైన కొరతే బీజేపీకి అతి పెద్ద నష్టం. గత లోక్‌సభలో 303 స్థానాల బలమున్న బీజేపీ, కొత్త లోక్‌సభలో 240 దరిదాపుల్లో సంతృప్తిపడవలసి వచ్చింది. మైనారిటీ ప్రభుత్వాన్ని నడపడం బీజేపీకి కొత్త కాదు. 1999 ఎన్నికలలో బీజేపీ 182 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. అయినా మిత్రపక్షాలతో కలిసి ఒకటో ఎన్‌డీఏ ప్రభుత్వం నడిపింది. కానీ, 2014లో 282, 2019లో 303 స్థానాలను గెలుచుకుని సంకీర్ణ ప్రభుత్వాల పేరుతో తన సొంత ప్రభుత్వాలనే నడిపింది. ఈ సారి, సొంతంగా 370 స్థానాలు గెలవాలని, మిత్రులతో కలసి 400 గెలవాలని ఆశించింది. అవి కేవలం సంఖ్యలు కావు. మూడింట రెండు స్థానాల మెజారిటీ కోసం 370, కాంగ్రెస్ 1984 రికార్డును అధిగమించడం కోసం 400 అంకెలను ఎంచుకున్నారు. అధిక మెజారిటీ కోరుకున్నది రాజ్యాంగ సవరణలకు వెసులుబాటు కోసమే కావచ్చు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి అదే ఆయుధంగా మారింది. రాజ్యాంగాన్ని మార్చబోతున్నారని, రాజ్యాంగం అట్టడుగు వర్గాలకు కల్పించిన ప్రత్యేక రక్షణలను తొలగించబోతున్నారని ప్రతిపక్షం చేసిన ఆరోపణ ఓటర్ల మీద తీవ్రంగా ప్రభావం చూపినట్టు, సామాజికవర్గాల వారీ ఓటింగ్ శాతాలు సూచిస్తున్నాయి.

పదిహేనేళ్ల తరువాత కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని దాదాపు రెట్టింపు చేసుకోగలగడానికి ఆ పార్టీ మిత్రపక్షాలతో చూపించిన సర్దుబాటు వైఖరి, రాహుల్ జోడో యాత్రలు, విస్పష్టమైన విధానాలతో వైఖరుల రూపకల్పన ముఖ్యమైన కారణాలు. బీజేపీ విస్తరణను అడ్డుకోగలిగిన మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రేలను ప్రధానంగా చెప్పుకోవాలి. ప్రతిపక్ష పార్టీలను, మాజీ మిత్రపక్షాలను చీలికల ద్వారా బలహీనపరచాలనే ఆలోచనను ప్రజలు సమ్మతించరని మహారాష్ట్ర నిరూపించింది. ద్రవిడ వాదానికి తాను పెట్టనికోటనని తమిళనాడు మరోసారి నిరూపించుకుంది. దేశంలోని ఈ నాయకబాహుళ్యం ఎక్కడికక్కడ ఆత్మరక్షణ చేసుకోవడంతో పాటు, అవాంఛనీయమైన అధిక మెజారిటీలను నిరోధించగలిగింది. పాపం, నవీన్ పట్నాయక్ బీజేపీని సొంతంగా ఢీకొని, నష్టపోయారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటికి, బీజేపీ ఘనవిజయమే ఖాయమన్న అభిప్రాయం దేశంలో నెలకొని ఉన్నది. అధికారపక్షం తగిన రాజకీయ నినాదాలతో సర్వసన్నద్ధంగా ఉన్నట్టు కనిపించింది. మొదటి రెండు దశల ప్రచారంలో సాధారణ అంశాలే వినిపించగా, మూడోదశనుంచి ప్రధాని మాటలో తీవ్రత, విభజనవాదం పెరిగాయి. ప్రధానిహోదాను కూడా ఖాతరు చేయకుండా, ఊహించని రీతిలో నరేంద్రమోదీ మాట్లాడసాగారు. ఆయన అట్లా మాట్లాడడానికి, ఓటర్లలో కనిపిస్తున్న అనాసక్తి కారణమన్న విశ్లేషణలు మొదలయ్యాయి. తక్కిన అన్నిదశలలోను, చివరి రోజుతో సహా, నరేంద్రమోదీ వివాదాస్పదమైన అంశాలే మాట్లాడుతూ వచ్చారు. మోదీ రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారని ఇండియా కూటమి, కాంగ్రెస్ కూటమి బీసీ, ఎస్సీల రిజర్వేషన్లు తగ్గించి ముస్లిములను ఇవ్వాలనుకుంటున్నదని మోదీ పరస్పర ఆరోపణలు సంధించుకున్నారు. మోదీ విభజన వాదానికి పెద్దగా ఆమోదం లభించలేదని ఫలితాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, రామమందిర ప్రతిష్ఠను, రాజకీయాలను ప్రజలు వేరువేరుగానే పరిగణించారని తెలుస్తోంది. అయోధ్య (ఫైజాబాద్) స్థానంలో బీజేపీ ఓడిపోయిందంటే అర్థం ఏమిటి?

ఉమ్మడి పౌరస్మృతి, రాజ్యాంగం నుంచి సెక్యులర్ పదం తొలగింపు, ఒకే దేశం–ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, జీఎస్టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులు వంటి అనేక అంశాలు బీజేపీ ఎజెండాలో ఉన్నాయి. ఈ అంశాలపై ప్రతిపక్షాలకు, ప్రాంతీయ పార్టీలకు భిన్నాభిప్రాయాలు, సొంత ప్రతిపాదనలు ఉన్నాయి. వీటికి సొంతంగా అధిక మెజారిటీ కావాలి, రాష్ట్రాలలో కూడా సొంతప్రభుత్వాలు ఉండాలి. ప్రాంతీయ పార్టీలను సాధ్యమైనంతగా అప్రధానం, బలహీనం చేయాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ ఆశయం. తమ ప్రభుత్వాలు ఉన్నచోట తప్ప, ఇతర ప్రభుత్వాలు ఉన్న చోట, ముఖ్యంగా ప్రాంతీయపార్టీలు ఉన్న ప్రభుత్వాలు ఉన్నచోట నిధుల పంపకంలో గానీ, గవర్నర్‌ల జోక్యంతో కానీ ఇబ్బందులు కల్పించడం గత పదేళ్లుగా చూస్తూ ఉన్నదే. అయితే, అనుకున్నంత బలం సమకూరదేమోనన్న భయం ఏ మూలో ఉండడంతో బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయపార్టీలతో కూటమిలోకి వచ్చింది.

ఎవరిమీదా ఆధారపడనక్కరలేని స్థితిలో, కేంద్రప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీలను ప్రతిపక్షాల మీద ప్రయోగించడానికి, రాజకీయనేతలను జైళ్లలో పెట్టడానికి బీజేపీ ప్రభుత్వానికి వెసులుబాటు లభించింది. రాష్ట్రాల అధికారాలను కుదించే అనేక నిర్ణయాలను కూడా గత పదేళ్లలో యథేచ్ఛగా తీసుకోగలిగారు. సంకీర్ణ ప్రభుత్వాలను నడిపేవారు ఏకాభిప్రాయ సాధనలో నిమగ్నం కావలసి ఉంటుంది. అందుకు వాజపేయి, మన్మోహన్ సింగ్‌కు ఉన్నటువంటి మృదు స్వభావం అవసరం. నరేంద్ర మోదీ తానే మూడోసారి ప్రధాని కాదలచుకున్నట్టు, మంగళవారం సాయంత్రం ఢిల్లీలో పార్టీ కార్యక్రమంలో ఇచ్చిన సందేశం సూచిస్తోంది. ప్రస్తుత విజయాన్ని ఎన్డీఏ విజయంగానే చెబుతున్నారు, రాబోయే ప్రభుత్వాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వంగానే సంబోధించారు. అవినీతిపై చండశాసనంలో తగ్గేదే లేదని, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో ముందుకే వెడతామని ఆయన గట్టిగా చెప్పారు. 2019 నాటి సంబరాలతో పోల్చినప్పుడు, ఇప్పటి పార్టీ కార్యక్రమం నీరసంగానే కనిపించింది.

లోక్‌సభ ఫలితాలు మోదీ పరాజయాన్నే సూచిస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారం అంతా మోదీ వ్యక్తి ప్రతిష్ఠచుట్టూ జరిగినందున, మెజారిటీ పొందలేకపోవడం మోదీ వ్యక్తిగత అపజయంగా పరిగణించడంలో తప్పేమీ లేదు. మోదీ, అమిత్ షా ఇద్దరే మొత్తం పరిపాలనాచక్రాన్ని, రాజకీయచక్రాన్ని ఇంత కాలం తిప్పుతూ వచ్చినందున, సంప్రదింపులు, సమన్వయం అవసరమైన నూతన ప్రభుత్వాన్ని వారు సౌకర్యంగా నిర్వహించగలరా అన్న అనుమానం రావడం సహజం. తాను తప్పుకుంటానని మోదీ పార్టీ ముఖ్యుల ముందు ప్రస్తావించారేమో తెలియదు కానీ, ప్రస్తుతానికి పాత నాయకద్వయమే అగ్రపీఠాలపై కొనసాగుతారనిపిస్తోంది.

ఇండియా కూటమి నుంచి చంద్రబాబు నాయుడుకు, నితిశ్ కుమార్‌కు సూచనలు వెళ్లాయని చెబుతున్నారు కానీ, వారు అందుకు అంగీకరించే అవకాశం లేదు. ఈ తరుణంలో వారు తమ భాగస్వాములను మార్చుకోవడం నైతికం కాదు. కాకపోతే, ప్రజాస్వామిక సంప్రదాయాలను అనుసరించేట్టు, విభేదించేవారితోనూ విపక్షాలతోనూ వేధింపు ధోరణిలో వ్యవహరించకుండా బీజేపీని మిత్రపక్షాలు కట్టడి చేయగలిగితే బాగుండునని ప్రజాస్వామికవాదులు ఆశిస్తున్నారు.

ఈ ఎన్నికలు నిరూపించిన మరొక ముఖ్యమైన అంశం, మతం పేరుతో, జాతీయత పేరుతో ఎంతటి ఉద్వేగాలను వ్యాపింపజేసినా, అవి దైనందిన జీవన సమస్యల నుంచి ప్రజలను ఎంతోకాలం దృష్టి మళ్లించలేవు. ఈ ఎన్నికలఫలితాలు గ్రామీణ భారతంలోని సంక్షోభపరిస్థితులను సూచిస్తున్నాయని, ప్రజలు స్పష్టంగా ఒక సంకేతం పంపించారని విశ్లేషకులు చెబుతున్నారు.


ప్రజాప్రతినిధుల అరాచక హింసోన్మాదాన్ని, అవినీతిని ఓటు ఆయుధంతో తిప్పి కొట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, తమ కొత్త ప్రభుత్వం ద్వారా విభజనానంతర సమస్యల పరిష్కరించుకుంటారని, అన్ని హంగుల రాజధానితో సహా అభివృద్ధి ఆకాంక్షలన్నిటిని సాధించుకుంటారని ఆశిద్దాం. •

బాబు నాయకత్వానికి, కూటమి దక్షతకు పట్టం

చంద్రబాబు పాలనలో 2014–19 మధ్య అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు లబ్ధిపొందాయి. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం సమపాళ్లలో జరిగింది. ప్రజాస్వామ్యయుతంగా పాలన నడిచింది. 2019–24 మధ్య జగన్ పాలన చంద్రబాబు పాలనకు పూర్తి విరుద్ధంగా నడిచింది. ఆ తేడాను ప్రజలు అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నారు. జగన్‌ను గెలిపించి మోసపోయామని ప్రజలు బాధపడుతున్న సమయంలో అక్రమ కేసులతో చంద్రబాబును 53 రోజులు జైల్లో నిర్బంధించారు. భువనేశ్వరిని శాసనసభలో అవమానపరచడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. లోకేష్ ప్రజాగళాన్ని అడ్డుకోవడం, పవన్‌కళ్యాణ్ వ్యక్తిత్వంపై దాడి చేయడం ప్రజలకు కోపాగ్ని రగిల్చింది. అంతిమ నిర్ణేతలు ప్రజలేగాని నిర్బంధాలు, మద్యం పీపాలు కాదని ఈ ఎన్నికలు రుజువు చేశాయి.

ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇది అతిపెద్ద ప్రజా తీర్పు. జగన్‌కు ప్రతిపక్ష హోదాను కూడా ప్రజలు ఇవ్వలేదు. విధ్వంసం నుండి రాష్ట్రాన్ని చంద్రబాబు పాలన మాత్రమే గట్టెక్కించగలదని ప్రజలు భావించి ఇచ్చిన తీర్పు ఇది. మోసపోయిన పేదలు ఇచ్చిన తీర్పు. భవిత కోసం యువత ఇచ్చిన తీర్పు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇచ్చిన తీర్పు. తమ ఆస్తులు, ప్రాణాలు కాపాడుకోవడానికి సకల జనులు ఇచ్చిన తీర్పు. ప్రజాస్వామ్య పరిరక్షణకు మేధావులు ఇచ్చిన తీర్పు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాయకత్వాలకు ప్రజలు పట్టం కట్టిన తీర్పు.

ఈ అధికారం చంద్రబాబుకు పూలబాట కాదు. రూ. 13 లక్షల కోట్లు అప్పుతో ఏడాదికి రూ.50 వేల కోట్ల వడ్డీ, అసలు వాయిదాల చెల్లింపు భారం మోయాల్సి వుంది. వివిధ వర్గాలకు జగన్ పెట్టిన బకాయిలు రూ.2 లక్షల కోట్ల చెల్లింపులు చేయాల్సి వుంది. మేనిఫెస్టో హామీలు అమలు



చేయాలి. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేయాల్సి వుంది. అమరావతి నిర్మాణం చేసి ఉద్యోగాలు, సంపద సృష్టి చేయాల్సి ఉంది. నీలి మీడియా, జగన్ మాఫియా దుష్ప్రచారాలు, దాడులు ఎదుర్కోవాల్సి వుంటుంది. ఈ విజయంతో కూటమి శ్రేణులు నమ్రత పెంచుకుని ప్రజాభిమానాన్ని మరింత పెంచుకోవాలి. 2004లో చంద్రబాబు ఓడిపోకుండా వుంటే నేడు ప్రతి జిల్లా కేంద్రం మరో సైబరాబాద్ అయి వుండేది. 2019లో ఓడిపోకుండా వుంటే నేటికి 175 నియోజకవర్గ కేంద్రాలు ఉపాధి కల్పనా కేంద్రాలుగా అభివృద్ధి అయి వుండేవి. రాష్ట్రానికి జగన్ విధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అధిగమించాలి. అందుకు చంద్రన్న నాయకత్వమే తగినదని ప్రజలు నిర్ణయించారు. అందుకే, క్లాసు, మాసు ఒక్కటై బందిపోట్ల ముఠాను చిత్తుచిత్తుగా ఓడించాయి. జగన్ అండ్ కో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపాడు. విషపూరిత మద్యం పోసి 35 లక్షల మంది పేదల ఆరోగ్యాలను పాడు చేశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణ పేదల అసైన్‌మెంట్ భూములు 10 లక్షల ఎకరాలు కొల్లగొట్టారు. లక్ష కోట్ల సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించాడు. పంచాయతీలు, మున్సిపాలిటీల నిధులు దారిమళ్లించి స్థానిక పాలనను నిర్వీర్యం చేశారు. పోలవరాన్ని గండికొట్టి కరువుకోరలకు ప్రజల్ని బలిపెట్టాడు. విశాఖ భూ కబ్జాల కోసం అమరావతిపై నిందలు మోపి ఉద్యోగాలు, సంపద సృష్టించే రాజధాని లేకుండా చేశాడు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం మాఫియాగా మారి రూ.10 లక్షల కోట్లు విలువ గల ప్రకృతి వనరుల్ని, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. ప్రయివేట్ ఆస్తుల్ని, భూముల్ని కబ్జా చేయడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చారు. ప్రశ్నించిన పౌరుల్ని, మీడియాను, మేధావుల్ని, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లలో తోయించాడు. చిన్నాన్న హంతకుల్ని కూడా కాపాడే దుర్మార్గ స్థితికి దిగజారాడు. తన నేరాలు, ఘోరాల నుండి ప్రజల దృష్టి మళ్ళించడానికి కుల, మత, ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొట్టాడు. పదిచ్చి వంద గుంజుకొన్న వైనాన్ని పేదలు అర్థం చేసుకున్నారు. తన స్వార్థ రాజకీయం కోసం 30 మందికి పైగా పింఛన్‌దారుల ప్రాణాలు పోగొట్టి శవ రాజకీయం చేశాడు. గులకరాయి దాడి కథ నడిపి ఓ బీసీ బిడ్డను 45 రోజులు జైలుపాలు చేశాడు. కోడికత్తి డ్రామాతో దళిత యువకుణ్ణి ఐదేళ్ళు జైలుపాలు చేశాడు. పేదల్ని ఇలా కాల్చుకు తిని పేదల మనిషిగా కపట ప్రేమ ఒలకబోశాడు. పేదల ద్రోహి జగన్ అని, పేదల పెన్నిధి చంద్రన్న అని గుర్తించి వైకాపాకు పేదలు తగిన శాస్తి చేశారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాలు కూటమికి అఖండ విజయం చేకూర్చాయి. రాష్ట్ర చరిత్రలో ప్రతిపక్ష నాయకత్వ హోదా కోల్పోయింది జగన్ ఒక్కడే.

– గురజాల మాల్యాద్రి
టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి

మోదీ మ్యాజిక్ ఏమయింది?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'రాసిన అక్షరం కన్నా ఉపన్యాసాలే జనాన్ని ప్రభావితం చేస్తాయని నాకు తెలుసు. మహా మహా రచయితలు సాధించలేని మార్పు ఈ భూమిపై గొప్ప వక్తలే సాధించారు' అని జర్మనీ నియంత హిట్లర్ తన ఆత్మకథ 'మెయిన్ కాంఫ్' (ఆంగ్లంలో 'మై స్ట్రగుల్') ముందుమాటలో రాశారు. కాని నేతలు ఎంత గొప్ప వక్తలైనా వారి మాటల్లో నిజాయితీ లేకపోతే, రోజుకో రకంగా మాట్లాడితే, మాట్లాడిన మాటల్లో అబద్ధాలున్నాయని తేలితే ప్రజలు ఆ మాటల్ని విశ్వసించరని ఎవరికి ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో వారికి బాగా తెలుసని మంగళవారం నాడు వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ ఫలితాలను సువర్ణ ఘట్టంగా భావించవచ్చు.

ఒక దశాబ్ద కాలం (2014–24)లో దేశంలో అన్ని వ్యవస్థలపై పట్టు సాధించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తానేమి చేసినా ప్రజలు హర్షిస్తారని, కేవలం తన ప్రచారంతోనే వారు మైమరిచిపోయి బీజేపీకి పట్టం కడతారని ఆశించినట్లు అర్థమవుతోంది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఆయన దాదాపు 200 ఎన్నికల సభల్లో ప్రసంగించారు. వివిధ భాషల్లో కనీసం 50 టీవీ ఛానెల్స్‌కు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఎన్నికలు లేనప్పుడు కూడా ఆయన నెలకు కనీసం 20 ప్రసంగాలు చేశారు. టీవీ ఛానెల్స్, సోషల్ మీడియా యుగం కనుక తన హావభావాలతోనూ, ధ్యానముద్రలతోనూ కూడా జనాన్ని ఆయన ప్రభావితం చేయాలనుకున్నారు. తన పేరును తానే వందలసార్లు ఉచ్చరించారు. బీజేపీకి స్టార్ క్యాంపెయినర్లు ఎంతో మంది ఉన్నప్పటికీ మోదీయే అసలైన స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభం నుంచి రాముడి ప్రాణప్రతిష్ఠ వరకు తానొక్కడే అన్నట్లుగా వ్యవహరించారు. పదే పదే ఒకే మాట చెబితే జనం నమ్ముతారేమోనని భావించి చార్ సౌ పార్ (400కు పైగా) సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాంగ్రెస్ ఈ సారి 50 సీట్లు కూడా దాటదని చెప్పారు. తానేది చెబితే జనం అది నమ్ముతారని పరిపూర్ణంగా విశ్వసించిన మోదీ ప్రతిపక్షాలు ప్రజల వనరులను ముస్లింలకు పంచిపెడతారని చెప్పేందుకు కూడా వెనుకాడలేదు. మహాత్ముడిపై రిచర్డ్ అటెన్‌బరో సినిమా తీయక ముందు గాంధీ ఎవరో లోకానికి తెలియదని చెప్పేందుకు కూడా ఆయన తెగించారు!

రోజురోజుకూ ఒక వ్యక్తి కేంద్రీకృత వ్యవస్థగా మారిన భారతీయ జనతా పార్టీకి మోదీ తిరుగులేని నాయకుడే కావచ్చు. ఆయన నాయకత్వానికి ఆయనే ముగ్ధుడై తనది కారణ జన్మ అని, దేవుడే తనను పంపించాడని చెప్పుకున్నారు. పూరీ జగన్నాథుడే మోదీ భక్తుడని బీజేపీ అధికార ప్రతినిధి ఒకరు వాక్రుచ్చారు. మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ నిర్మాణపరంగా ఎంతో ఎదిగిపోయిందని, దానికి ఆర్ఎస్ఎస్ వంటి సంస్థ అవసరం ఇక ఏ మాత్రం లేదని భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాయే ప్రకటించారు. గంటకు పైగా ఇంటర్వ్యూలు చేయడం తప్ప ప్రజల మనసుల్లో ఉన్న ప్రశ్నలను లేవనెత్తాలని జర్నలిస్టుల రూపంలో వచ్చిన టీవీ ప్రతినిధులు కూడా అనుకోలేదు. ఏమైతేనేం దాదాపు 80 రోజులుగా జరిగిన ఎన్నికల ఘట్టంలో ఎన్నో నాటకీయ దృశ్యాలు, భావోద్వేగ ప్రసంగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలు చూసే అవకాశం కలిగింది. అంతిమంగా ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన దాదాపు డజన్ సంస్థలు ఎన్డీఏకు 350కి పైగా స్థానాలు లభిస్తాయని, మోదీ అన్నట్లుగా 400 దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ప్రకటించడంతో ఈ దేశంలో మీడియా సంస్థల ధైర్యం ఎంత దిగజారిపోయిందో, ఎందుకు వారు భయోత్పాతానికి గురయ్యారో అర్థం అవుతుంది. కేవలం షేర్ మార్కెట్ పతనం కాకుండా ఉండేందుకే వారు అలా చేశారా అన్న అనుమానాలూ లేకపోలేదు.

నిజానికి మోదీని ఢీకొనడం అంత సులభం కాదని, ఆయన ఏ విధంగానైనా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని అనుకున్నవారే ఎక్కువగా ఉన్నారు. చండీగఢ్‌లో మేయర్ ఎన్నికల్లో బ్యాలట్ పేపర్లలో మార్పులు చేయడం, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి పేరును ప్రతిపాదించినవారు రిటర్నింగ్ అధికారి వద్దకు రాలేకపోవడం, ఇండోర్‌లో నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకోవడం, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇద్దరు ముఖ్యమంత్రులు అరెస్టు కావడం వంటి ఘట్టాల తర్వాత ఇక మోదీ ఘన విజయాన్ని ఎవరు ఆపగలరులే అని చాలా మంది భావించారు. ఈడీ, సిబిఐ వంటి సంస్థలు సృష్టించిన భయోత్పాతం అంతా ఇంతా కాదు. పార్లమెంట్‌లో చర్చలు లేకుండా, ప్రతిపక్షాలు లేకుండా బిల్లులు ఆమోదించడంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైందనిపించింది. ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పుతో బీజేపీ అక్రమ నిధుల వసూళ్ల గురించి జనానికి తెలిసినా పెద్దగా పట్టించుకోరేమో అనిపించింది. కాని ఆశ్చర్యకరంగా ఎన్నికల ఫలితాలను చూస్తే మోదీ మాయాజాలం చాలా మటుకు మాయమైపోయినట్లు అర్థమవుతోంది.

నిజానికి ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు అవసరమైనంత



నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీల నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల బీజేపీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదేమో? కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని 2024లో తేలిపోయింది.

సంఘటితంగా పనిచేయలేదు. ఇండియా కూటమి ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ఆ పార్టీలో సీనియర్ నాయకుడు నితీశ్ కుమార్ ప్లేటు ఫిరాయించి మరోసారి బీజేపీతో చేతులు కలిపారు. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇండియా కూటమి సభ్యులకు తగినన్ని సీట్లు ఇచ్చేది లేదని చెప్పేశారు. పంజాబ్‌లో కూడా కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపచేయడంతో ఆ సంస్థ ఆర్థికంగా బలహీనపడింది. మధ్యప్రదేశ్, హర్యానాలాంటి చోట్ల బలమైన కాంగ్రెస్ నేతల్ని బీజేపీ తన వైపునకు తిప్పుకుంది. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష పార్టీలను నిలువునా చీల్చారు. ఎన్నో బలహీనతలు, సమస్యలు, వనరుల లోపాల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రతిపక్షాలు ప్రచారాన్ని నిర్వహించాయి. మోదీ, ఆయన దళం చేసిన భారీ ప్రచారం ముందు ప్రతిపక్షాల ప్రచారం వెలవెలబోయినట్లు కనిపించింది. అయినప్పటికీ ఇవాళ బీజేపీ గత రెండు ఎన్నికల్లో మాదిరి మెజారిటీ సీట్లు సాధించలేకపోవడం, ఇండియా కూటమికీ, ఎన్డీఏకు మధ్య సీట్ల వ్యత్యాసం బాగా తగ్గిపోవడం మోదీ ఏకచత్రాధిపత్యాన్ని జనం కోరుకోవడం లేదని అనుకోవడానికి ఆస్కారం కలిగిస్తుంది.

ఉత్తరప్రదేశ్ లాంటి బీజేపీ కంచుకోటలో సగానికి సగం సీట్లు కోల్పోవడం, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లోనే బీజేపీ అభ్యర్థి ఓడిపోవడం దేనికి సంకేతం? గతంలో కూడా బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత జరిగిన నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ పరాజయం పాలైంది. అయోధ్యలో నాడు కూడా బీజేపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇప్పుడు రామమందిర నిర్మాణం తర్వాత కూడా యూపీలో బీజేపీ ప్రాభవం తగ్గిపోవడం ఏ సంకేతాలు పంపిస్తున్నాయి? రామమందిర నిర్మాణం కల్పించిన భావోద్వేగాలు పొంగే కాని, వాపు కాదని, ఈ దేశంలో మతాన్ని రాజకీయాలతో సమ్మిళితం చేయడాన్ని రాజ్యాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అనుకోవాలా? లేక ప్రధానమంత్రి నరేంద్రమోదీ మతాన్ని తన స్వంత రాజకీయాలకు ఉపయోగించుకోవడాన్ని జనం హర్షించడం లేదని భావించాలా? నిజానికి మోదీ వన్ మాన్ షోను కొందరు ఆర్ఎస్ఎస్ నేతలే హర్షించలేదు. ఈ ఎన్నికల్లో మోదీకి సంపూర్ణ మెజారిటీ రాకపోతేనే మంచిదని, వస్తే తమను కూడా లెక్కచేయరని అనుకున్న ఆర్ఎస్ఎస్ పెద్దలు కూడా ఉన్నారు. ఎందుకో నాగపూర్ కూడా ఈ సారి అన్యమనస్కంగానే వ్యవహరించింది. ఆర్ఎస్ఎస్ పూర్తిగా బీజేపీని వదిలేస్తే ఈ 240 సీట్లు కూడా వచ్చేవి కావని అనుకునేవారు ఉన్నారు.

నిజానికి బీజేపీ నుంచి గెలిచిన వారిలో ఒరిజినల్ బీజేపీ నేతలకన్నా బయటి పార్టీ నుంచి వచ్చిన వారు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. ఉదాహరణకు తెలంగాణలో బీజేపీ నుంచి గెలిచిన వారిలో సగానికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. కేరళలో సినీనటుడు సురేష్ గోపి బీజేపీ బలంతో కన్నా తన వ్యక్తిగత ఆకర్షణ ఆధారంతో గెలిచారనవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం మద్దతు లేకపోతే బీజేపీకి అసెంబ్లీలో కాని, పార్లమెంట్‌లో కాని ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు. అందువల్ల మోదీ మూలంగానే బీజేపీకి ప్రాభవం ఏర్పడిందని చెప్పడానికి వీల్లేదు. 2014లో కొన్ని సామాజిక, చారిత్రక, ఆర్థిక కారణాల వల్ల భారతీయ జనతా పార్టీకి ప్రజలు పట్టం కట్టారు. పుల్వామా, బాలాకోట్ సంఘటనలు జరగకపోతే 2019లో కూడా బీజేపీకి మెజారిటీ వచ్చేది కాదని చెప్పేవారు కూడా లేకపోలేదు. 2024లో కేవలం మోదీ పేరును మార్మోగిస్తే సరిపోదని తేలిపోయింది.

ఏమైతేనేం పది సంవత్సరాల తర్వాత దేశంలో మళ్లీ సంకీర్ణ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. రెండుసార్లు అఖండమైన మెజారిటీతో బీజేపీని గెలిపించినప్పటికీ మోదీ మళ్లీ దేశం సంకీర్ణ యుగంలోకి వెళ్లకుండా చేయలేకపోయారు. ఇది కూడా మంచి పరిణామమే. రాష్ట్రాల ఆకాంక్షలను విస్మరించకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. నిజానికి ఈ పదేళ్లు ప్రజాస్వామికంగా, ఏకాభిప్రాయ సాధనతో పరిపాలన సాగించి ఉంటే, ప్రతిపక్షాలనూ విశ్వాసంలోకి తీసుకుని ఉంటే, అన్ని వ్యవస్థల్నీ నియంత్రణలోకి తీసుకోకుండా వాటిని పారదర్శకంగా స్వేచ్ఛగా పని చేయించి ఉంటే, ఏడాదికి కనీసం ఒక్క విలేఖరుల సమావేశమైనా నిర్వహించి అరమరికలు లేకుండా మాట్లాడి ఉంటే, ప్రతిపక్షాలను అణచివేయాలన్న ఆలోచనను వదిలిపెట్టి ఉంటే మోదీ మళ్లీ భారీ మెజారిటీతో తిరిగి వచ్చేవారేమో. ఒక బలమైన వ్యవస్థ, బలమైన భావజాలం ఉన్నప్పటికీ అవి ఒక వ్యక్తి చుట్టూ తిరిగితే విజయవంతం కాలేవని ఈ ఎన్నికలు స్పష్టం చేశాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

స్వచ్ఛమైన పర్యావరణమే గొప్ప వారసత్వ ఆస్తి!

భూమిపై ఉన్న అన్ని జీవులకు పర్యావరణం ప్రాథమిక జీవన సహాయక వ్యవస్థ. ఇది సహజ, మానవ నిర్మిత భాగాల కలయిక. సహజ భాగాలలో గాలి, నీరు, భూమి, జీవులు ఉన్నాయి. రోడ్లు, పరిశ్రమలు, భవనాలు మొదలైనవి మానవ నిర్మిత భాగాలు. సహజ వాతావరణాన్ని నాలుగు ప్రధాన భాగాలుగా విభజించవచ్చు – బయోస్పియర్, లిథోస్పియర్, హైడ్రోస్పియర్, అట్మాస్పియర్. భూమిపై పొరను లిథోస్పియర్ అని పిలుస్తారు. ఇది రాళ్ళు, ఖనిజాలతో చేసిన నేల పలుచని పొర. హైడ్రోస్పియర్ సముద్రాలు, మహాసముద్రాలు, నదులు, సరస్సులు, చెరువులు మొదలైన నీటి వనరులను కలిగి ఉంటుంది. నీటి ఆవిరి, వాయువులు, ధూళి కణాలతో కూడిన వాతావరణం భూమిని చుట్టుముట్టే గాలి పొర. మానవులు, మొక్కలు, జంతువులతో కూడిన జీవ ప్రపంచం జీవగోళాన్ని ఏర్పరుస్తుంది. పర్యావరణాన్ని తయారు చేయడంలోను, విచ్ఛిన్నం చేయడంలోనూ మానవులు భారీ పాత్ర పోషిస్తున్నారు. భూమిపై అత్యున్నత మేధోశక్తిగా, మానవులు పర్యావరణ క్షేమాన్ని చాలావరకు ప్రభావితం చేస్తారు. అన్ని జీవులపై పర్యావరణ ప్రభావం మానవులు పర్యావరణంతో వ్యవహరించే విధానానికి నేరుగా అనులోమానుపాతంలో వుంటుంది. గాలి, నీరు లేదా భూమి లేకుండా ఎలాంటి ఉనికి సాధ్యం కాదు.

భూమిపై సంచరించే అన్ని రకాల ప్రాణుల ఉనికికి పర్యావరణమే ప్రాథమిక మూలం. అయితే, నేడు పర్యావరణం విపరీతంగా దోపిడీ చేయబడుతోంది, దీని కారణంగా పర్యావరణ పరిస్థితులు రోజురోజుకు అధ్వాన్నంగా మారుతున్నాయి. గాలి, నీరు మరియు భూమి కాలుష్యం, మైనింగ్, పారిశ్రామికీకరణ, ఆధునిక పట్టణీకరణ, అటవీ నిర్మూలన, రసాయన వ్యర్థాల విడుదల వంటివి పర్యావరణం క్రమంగా క్షీణించడానికి కారణమయ్యే కొన్ని ప్రధాన కారకాలు.

పర్యావరణపు వేగవంతమైన క్షీణతను తగ్గించడానికి ప్రపంచ నాయకులు కృషి చేస్తున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు పర్యావరణ సమస్యలను అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పించడానికి, చర్యలు తీసుకోవడానికి చొరవతో ముందుకు వచ్చాయి. ఈ కార్యక్రమాల్లో కొన్ని 2019 సస్టెయినబుల్ డెవలప్మెంట్ సమ్మిట్, 2019 క్లయిమేట్ యాక్షన్ సమ్మిట్, సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ కోసం 2030 ఎజెండా, పారిస్ ఒప్పందం, ఇంకా నదుల సంరక్షణ, అటవీ పెంపకం, తీర నిర్వహణ, చిత్తడి నేల పరిరక్షణ మొదలైన అనేక ఇతర కార్యక్రమాలు చేపట్టాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మొక్కుబడి కార్యక్రమాలు చేస్తున్నాయి. ప్రచార ఆర్భాటంగా పర్యావరణ దినోత్సవం రోజున కొన్ని మొక్కలు నాటుతున్నాయి. నాయకుల పర్యటనల సందర్భంగా అవి అడ్డుగా ఉంటున్నాయని అధికారులు కొన్ని చెట్లను నరికేస్తున్నారు. ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పాలి. చిత్తశుద్ధితో మొక్కలు నాటి, వాటి పోషణ భారాన్ని కూడా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్వీకరించాలి. కవులు, రచయితల నుండి పర్యావరణ సాహిత్యాన్ని ఆహ్వానించి, ప్రోత్సహించి పుస్తకాలుగా అచ్చేసి రేపటితరానికి అందించాలి. పర్యావరణం కేంద్రంగా పాఠ్యపుస్తకాలను రూపొందించాలి.

వన్యప్రాణులు, వివిధ జాతుల మనుగడ కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం అవసరం. వాతావరణ మార్పుల వినాశకరమైన వేగంతో, కాలుష్యం – పర్యావరణం దోపిడీ ఫలితంగా, పర్యావరణానికి మరింత నష్టం జరగకుండా రక్షించే మార్గాలను కనుగొనడం మొదటి ప్రాధాన్యతగా వుండాలి. పర్యావరణాన్ని మానవ దోపిడీకి ముందున్న పూర్వ స్థితికి తీసుకురావడం చాలా ముఖ్యమైన, ఏకైక పరిష్కారం.

కొందరు తమ స్వార్థం కోసం కొండల్ని పిండి చేస్తున్నారు, చెట్లన్నీ నేల కూలుస్తున్నారు, నీటి నిల్వల్ని పీల్చేస్తున్నారు, జంతువుల్ని వేటాడి చంపుకు తింటున్నారు, పక్షుల్ని కాల్చుకు తింటున్నారు. మొత్తం పర్యావరణాన్ని దోచేసి ఆర్థిక నిల్వల్ని పెంచుకుంటున్నారు. రేపటి తరానికి అసలు పర్యావరణ పచ్చదనపు ఆనవాలు లేకుండా చేస్తున్నారు. మంచి గాలి, నీరు, భూమి, ఆహ్లాదం లేకుండా రేపటితరం ఎలా జీవించగలుగుతుంది? ఆస్తులుంటే సరిపోతుందా? పీల్చేందుకు ఆక్సిజన్ అవసరం లేదా? పర్యావరణ పరిరక్షణంతా ప్రభుత్వ బాధ్యతగానే భావించకుండా ప్రజలు కూడా తమవంతుగా కృషి చేయాల్సిన అవసరం వుంది. పచ్చని పర్యావరణాన్ని కొల్లగొట్టడం మాని, మనిషికొక మొక్కయినా నాటాలి. ఆ కోట్లాది మొక్కలు నేలపై తల ఎత్తుకు నిలబడి, మన ఆరోగ్యాన్ని అనారోగ్యం వైపునకు వాలిపోకుండా నిలబెడతాయి.

– కలిమిశ్రీ, నవ్యాంధ్ర రచయితల సంఘం
(నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటొపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com


నందమూరి నగర్‌లో కేక్ కట్ చేస్తున్న అభిమానులు


కొడిమిలో టీడీపీ శ్రేణుల సంబరాలు


ఎన్‌ఆర్ కాలనీలో పూజలు నిర్వహిస్తున్న అభిమానులు


జన్మభూమినగర్‌లో కేక్ కట్ చేస్తున్న వాసులు


మంగళవార కాలనీలో కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ రాజారావు


కనగానపల్లిలో సంబరాలు


విజయోత్సవ ర్యాలీలో అనంతపురం అర్బన్ కూటమి అభ్యర్థి దగ్గుపాటి


అనంతపురంలో అభిమానులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

ఊరు.. వాడా... విజయోత్సవాలు

- జిల్లా కేంద్రంలో మిన్నంటిన సంబరాలు
- ఉదయం 11.30 గంటలకే రోడ్లపైకి
- రోడ్లపై ర్యాలీలు, బాణాసంచా కాలుస్తూ...ఆనందం
- రెపరెపలాడిన పచ్చ జెండాలు
- తమ్ముళ్లలో ఆకాశాన్నంటిన ఆనందం

అనంతపురం విద్య, జూన్ 4 : కూటమి కోటలో సంబరాలు వెలిశాయి. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు లీడ్ చేస్తూ... దూసుకెళ్లడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల్లో జోష్ పెరిగింది. మంగళవారం పోలింగ్ మొదలైన తర్వాత 10 గంటల నుంచి కూటమి అభ్యర్థుల లీడింగ్ సంఖ్య కనిపించిన వెంటనే కూటమి అభ్యర్థుల్లో ఆనందం మొదలైంది. మధ్యాహ్నం 11.30 గంటలకే బైక్‌లకు సైలెన్సర్లు తీసేశారు. తర్వాత గంట గంటకు సంబరాలు మొదలెట్టారు. మధ్యాహ్నం 3 తర్వాత తెలుగుదేశం పార్టీ తమ్ముళ్లు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర వాహనాలకు జెండాలుకట్టి నగరంలో రోడ్లపై ఈలలు వేస్తూ..గోల చేస్తూ... సందడి చేసి సంబరపడ్డారు. సాయంత్రం తర్వాత రోడ్లపైకి వచ్చిన టీడీపీ నాయకులు, ప్రజలు టపాసులు పేల్చుతూ.... టీడీపీకి, కూటమికి జేజేలు పలుకుతూ..., స్వీట్లు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. అనంతపురం అర్బన్ అభ్యర్థి దగ్గుపాటి వెంకట ప్రసాద్ విజయంతో అనంతపురం నగరంలో సంబరాలు వెల్లివిరిశాయి. టీడీపీ అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ ఇంటి వద్ద, టీడీపీ పార్టీ అర్బన్ ఆఫీస్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో నగరంలోని అన్ని ప్రధాన వీధులు నిర్మానుష్యంగా కనిపించాయి. నగరంలోని ప్రధాన వీధులు, చిన్నపాటి వీధులు సైతం జనాలు లేక వెలవెలబోయాయి.

అనంతపురం క్లాక్‌టవర్ : అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయ సాధించిన నేపథ్యంలో అనంత నగర శివారు ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని జన్మభూమి నగర్‌లో ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు అనీల్‌కుమార్, లక్ష్మీనారాయణగౌడ్, నల్లప్ప, సీనా, ఇబ్రహీం, గాజుల వారాదయ్య, పార్వతమ్మ, వరలక్ష్మి, నవీన్, జితేంద్ర, హర్షవర్ధన్, సంజయ్‌నాయుడు, మోహిత్‌నాయుడు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, రాప్తాడు నియోజకవర్గం అభ్యర్థి పరిటాల సునీత గెలుపును పురస్కరించుకుని టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈలలు, కేకలు వేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కందుకూరులో విందు ఏర్పాటు చేశారు. కురుగుంట పంచాయతీ రమణకొట్టాలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని నరిగమ్మ, ముత్యాలమ్మ, పెద్దమ్మలకు టెంకాలు కొట్టారు. సిండికేట్‌నగర్‌లో టీడీపీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. అలాగే కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరినగర్‌లో నాయకులు కేక్ కట్ చేశారు. కొడిమి, ఉప్పరపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సావాల్లో మునిగి తేలారు. పాపంపేట సర్కిల్‌లో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అక్కంపల్లి పంచాయతీ ఎన్‌ఆర్ కాలనీ ఆంజినేయస్వామి ఆలయంలో అనంతపురం కుమ్మరశాలివాహన అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయం కోసం మంగళవారం ఉదయం పూజలు నిర్వహించారు. టెంకాలు కొట్టి మొక్కులు చెల్లించారు.

గార్లదిన్నె : శింగనమల నియోజకవర్గం కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ విజయం సాధించడంపై టీడీపీ, జనసేనా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. గార్లదిన్నె మండలంలోని గార్లదిన్నె, మర్తాడు, కోటంక, ఇల్లూరు, కల్లూరు, కేశవాపురం, కమలాపురం, పెనకచెర్ల, ముంటిమడుగు, బూదేడు, సంజీవపురం, కొప్పలకొండ, కృష్ణాపురం తదితర గ్రామాల్లో టీడీపీ, జనసేనా, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేక్‌లు కట్‌చేసుకుని, బాణ సంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. గార్లదిన్నెలో బస్టాండ్ సర్కిల్ నుంచి టీడీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గేటుక్రిష్టారెడ్డి, గుర్రం ఆదినారాయణ, ఆవులక్రిష్ణ, ఇల్లూరు రామాంజి, గుత్తాబాలకృష్ణ, రామచంద్ర, జయరాం, ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, చితంబరప్ప, శేఖర్, గోరకాటి వెంకటేసు, వడ్లరాము, బాబయ్య, సుబ్బయ్య, పుల్లన్న, గుర్రం శీనా, రామాంజి పాల్గొన్నారు. కల్లూరులో టీడీపీ నాయకులు విందుతో సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ సంఘం నాయకులు బాబయ్య, సింహాద్రి, జమ్మన్న, సురేంద్ర, అంజి, సుధాకర్, బాలు, రెడ్డి, మస్తాని పాల్గొన్నారు.

నార్పల : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి చేజిక్కించుకోవడంతో పాటు శింగనమల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి గెలుపొందడంతో సంబరాలు అంబరాన్నంటాయి. నార్పల మండలంలో ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో జై చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ భారీ విందు చేసుకున్నారు. దీంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు 14 స్థానాలు టీడీపీ గెలుపొందడంతో టీడీపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు.

రాప్తాడు : చంద్రబాబు నాయుడు, పరిటాల సునీత భారీ మెజార్టీతో గెలవడంతో టీడీపీ నాయకులు ఊరూరా సంబరాలు జరుపుకున్నారు. రాప్తాడులో టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప ఆధ్వర్యంలో సర్పంచ్ తిరుపాలు, గోనిపట్ల శీనా, సాకే జయరాముడు, కేశవ టీడీపీ నాయకులతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో విందు ఏర్పాటు చేసుకున్నారు. ద్విచక్రవాహనాలకు ఫ్యాన్ కట్టి రోడ్లపై ఈడ్చారు. రాప్తాడులో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మండల ఇన్‌చార్జ్ దర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప పరిటాల సునీత భారీ మెజార్టీతో గెలవాలని పూజలు చేశారు. అలాగే మండలంలోని మరూరు చిన్నకదరయ్యస్వామి ఆలయంలో మరూరు కదరయ్య ప్రత్యేక పూజలు చేశారు.

రామగిరి : మండలంలో టీడీపీ అభిమానులు, శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. ఏ గ్రామంలో చూసిన అభిమానులు బాణాసంచా కాల్చారు. కొన్ని చోట్ల స్వీట్లు పంచుతూ... రంగులు చల్లుకున్నారు. టీడీపీ రాష్ట్ర వ్యాప్తంగా క్లీన్ స్విప్ చేయడంతో జై తెలుగుదేశం.. సీఎం చంద్రబాబునాయుడు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సైకిళ్లకు, ద్విచక్రవాహనాలకు టీడీపీ జెండాలు కట్టుకుని ఊరేగింపు నిర్వహించారు.

శింగనమల : బండారు శ్రావణిశ్రీ విజయం సాధించడంతో ఊరూర సంబరాలు చేశారు. శింగనమలలో టీడీపీ శ్రేణులు అంబేద్కర్ వద్ద సంబరాలు చేశారు.

చెన్నేకొత్తపల్లి : చెన్నేకొత్తపల్లిలో టీడీపీ కార్యాలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ పలు ఆలయాలలో పూజలు చేశారు. విక్టరీ గుర్తు చూపుతూ బైబై వైసీపీ అంటూ నినాదాలతో హోరెత్తించారు.

బుక్కరాయసముద్రం : టీడీపీ శ్రేణలు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు నిర్వహించారు. గ్రామాలలో బైక్ ర్యాలీలు చేస్తూ సంబరాలలో టీడీపీ నేతలు, కార్యకర్తలు మునిగితేలారు. బుక్కరాయసముద్రంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్ తదితర టీడీపీ నేతలు స్వీట్స్ పంచి, ఆనందోత్సవాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్‌నారాయణస్వామి, కేశన్న, లక్ష్మీనారాయణ, నరేంద్రయాదవ్, రామక్రిష్ణ, సీపీఎస్‌ఎస్, హరి , బాబయ్య పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్ : కనగానపల్లి మండల వ్యాప్తంగా గ్రామగ్రామానా టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. పలు గ్రామాల్లో మహిళలు, యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. వృద్ధులు సైతం రోడ్లుపైకి వచ్చి నృత్యం చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. జై పరిటాల సునీత, జై చంద్రబాబు అంటూ హోరెత్తించారు.


గార్లదిన్నె బస్టాండ్ సర్కిల్లో..


గార్లదిన్నెలో వృద్ధుల ఆనందం


రాప్తాడులో కేక్ కట్ చేస్తున్న నాయకులు


రాప్తాడులో పూజలు చేస్తున్న ధర్మవరపు మురళి


అనంతపురంలోని బండారు శ్రావణి నివాసం వద్ద


బీకేఎస్‌లో రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో సంబరాలు

ఫ్యాన్ రెక్కలు విరిచి... ఈడ్చి పారేశారు...!


అనంతపురం, పాపంపేటలో ఫ్యాన్‌ను ఈడ్చుకు వెళ్తున్న నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ఫ్యాన్ స్పీడుకు బ్రేకులు పడితే... ప్రజలు, యువత మాత్రం ఆ ఫ్యాన్ రెక్కలు లేకుండా విరిచేశారు. మంగళవారం ఫలితాలు విడుదల నేపథ్యంలో నగరంలో పలు చోట్ల ఉదయం 11 గంటల నుంచే కూటమి నేతలు, ప్రజలు, యువత ఆనందోత్సవాల్లో మునిగితేలారు. నగరంలో పలుచోట్ల యువత తమ మోటార్ సైకిళ్లకు తాళ్లతో ఫ్యాన్‌ను కట్టుకొని రోడ్లపై ఈడ్చుకెళ్లి సంబరాలు చేసుకున్నారు. ఉదయం పలుమార్లు పోలీసులు అడ్డుకున్నప్పటికీ... ఫలితాలు కూటమి వైపే ఉండటంతో ఈ ఫ్యాన్ల ఊరేగింపు పెరిగిపోయింది. దీంతో పోలీసులు సైతం చూస్తూ ఉండిపోయారు. దీంతో నగరంలో పలు కాలనీల్లో యువత ఫ్యాన్ మోటార్ సైకిళ్లకు కట్టుకొని రెక్కలు ఊడిపోయేలా రోడ్లపై ఈడ్చుకెళ్లారు.

అనంతపురంరూరల్ : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు గెలుపు ఖరారు కావడంతో టీడీపీ శ్రేణులు బైక్‌కు వైసీపీ గుర్తు ఫ్యాన్‌ను కట్టి రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లారు. మండలంలోని పాపంపేట పంచాయతీలో కుమ్మరశాలి వాహన సాధికార సమితి సత్యసాయి జిల్లా కన్వీనర్ రామాంజినేయులు, మైనార్టీ సెల్ కార్యదర్శి బాబావలి, నాయకులు నరసింహులు, రవి, షాషా ద్విచక్రవాహనానికి వైసీపీ గుర్తు ఫ్యాన్‌ను వెనుకభాగంలో కట్టి పంచాయతీ మొత్తం తిరిగారు. బసవతారకనగర్, ఆంజనేయనగర్ తదితర ప్రాంతాల్లో ఫ్యాన్ ఈడుస్తూ.. బై..బై..వైసీపీ అంటూ నినాదాలు చేశారు.

దుకాణాలు బంద్ .. రోడ్లన్నీ నిర్మానుష్యం


పాపంపేట ప్రాంతంలో బంద్ చేసిన దుకాణాలు

అనంతపురంరూరల్, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో మండలంలో దుకాణాలు బంద్ చేశారు. జనసంచారం లేకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మంగళవారం ఎన్నికల కౌటింగ్ సందర్భంగా పోలీసులు మండలంలోని గ్రామాల్లో హోటళ్లు, కేఫ్‌లు, ఇతరాత్ర దుకాణాలు మూసివేంఇంచారు. ఎక్కడైన ఇద్దరు.. ముగ్గురు కనిపించినా.. పోలీసులు వారిని ఇళ్లకు పంపించేశారు. ప్రజలు ఇళ్లకే పరిమితమైయ్యారు. ఉదయం నుంచి టీవీల ఎదుట వాలిపోయారు. ఫలితాలను ఎంతో ఉత్కంఠంగా చూశారు.


నిర్మానుష్యంగా ఉన్న కళ్యాణదుర్గం రోడ్డు

కూటమి విజయం... ప్రజా విజయం

జనసేన పార్టీ నాయకులు పెండ్యాల శ్రీలత


జనసేన పార్టీ మహిళా కార్యాలయం వద్ద సంబరాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్ : కూటమి విజయం ప్రజా విజయమని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత అన్నారు. మంగళవారం కూటమి విజయం సాధించడంతో ఆ పార్టీ మహిళా కార్యాలయంలో ఆమె మహిళా కార్యకర్తలతో కలిసి పవన్‌కళ్యాణ్, చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆనందం పంచుకున్నారు. ఆమె మాట్లాడుతూ... ఇది ప్రజా విజయమని.. రాష్ట్రానికి పట్టిన దరిద్రం నేటితో తొలగిపోయిందని అన్నారు. ఇక కూటమి బాధ్యత రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి వైపు నడిపించడమే ప్రధాన బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ వీర మహిళలు, తెలుగు మహిళలు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటమి ఎరుగని పరిటాల సునీత

నాలుగో సారి విజయకేతనం


కుటుంబ సభ్యులతో పరిటాల సునీత

రాప్తాడు, జూన్ 4: పరిటాల సునీత మరోసారి విజయకేతనం ఎగరవేశారు. నాల్గవ సారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందారు. రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై మూడో సారి గెలుపొందారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో పరిటాల సునీత గెలుపొందడంతో నాయకులు, కార్యకర్తల సంబరాలు మిన్నంటాయి. అనంతపురం అరవింద్ నగర్‌లోని పరిటాల ఇంటి వద్దకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుని పరిటాల సునీతకు శుభాకాంక్షలు తెలిపారు. బాణా సంచా కాలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ సంబరాలు జరుపుకున్నారు. పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థతో కలిసి ఆమె కౌంటింగ్ కేంద్రానికి వెళ్లి ఆర్‌ఓ వసంతబాబుతో డిక్లరేషన్ పత్రం అందుకున్నారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయి టీడీపీకి పట్టం కట్టారన్నారు. రాప్తాడులో తోపుదుర్తి సోదరులు అరాచకాలు, వారిపై వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందన్నారు. వారి అరాచకాలు భరించలేక ప్రజలు టీడీపీకి మద్దతు తెలిపారన్నారు. ఐదు నెలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి సూపర్ సిక్స్, మేనిఫెస్టో పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా వైసీపీ అరాచకాలను ప్రజలకు వివరించారన్నారు. పరిటాల సునీత కుటుంబ సభ్యులతో కలిసి రామగిరి మండలం వెంకటాపురం వెళ్లి పరిటాల రవి ఘాట్ వద్ద డిక్లరేషన్ పత్రం ఉంచి ఉద్వేగానికి లోనయ్యారు. పరిటాల సునీతతో పాటూ పరిటాల శ్రీరామ్ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా పనిచేస్తామన్నారు. గెలుపు మరింత బాధ్యత పెంచిందని తెలిపారు.

ఫ్యాన్ రెక్కలు విరిచారు: జనసేన వరుణ్



అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 4 : సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఫ్యాన్ రెక్కలు విరిచేశారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... తమ అధినేత పవన్‌కళ్యాణ్ పొత్తులో భాగంగా తమకొచ్చిన సీట్లను బీజేపీ కోసం త్యాగం చేశారన్నారు. అదే విధంగా పార్టీని నమ్ముకున్న అనేక మంది నాయకులు సైతం అధినేత మాటకు కట్టుబడి పనిచేశారన్నారు. ఓ చంద్రబాబు విజన్... మరోవైపు పవన్‌కళ్యాణ్ త్యాగం... బీజేపీ సహకారంతో చరిత్ర సృష్టించారన్నారు.

టీడీపీ నాయకుల అరెస్టు


రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న టీడీపీ శ్రేణులు

అనంతపురం రూరల్, జూన్ 4: మండలంలో వైసీపీ నాయకులు, రౌడీషీటర్లను వదిలి... కేవలం టీడీపీ వారిని మాత్రమే రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ... మండలంలోని చిన్నంపల్లి, కక్కలపల్లి కాలనీ జాకీర్ కొట్టాల్లో కేవలం టీడీపీ శ్రేణులను మాత్రమే మంగళవారం ఉదయం అరెస్టు చేశారని వాపోయారు. వైసీపీ నాయకులు, రౌడీ షీటర్లను మాత్రం అరెస్టు చేయకపోవడం విడ్డురంగా ఉందన్నారు. రూరల్ సీఐ ఏకపక్షంగా వ్యవరిస్తున్నారని మండిపడ్డారు. మరి ఇంతలా వైసీపీ నేతలకు కొమ్ముకాసే పోలీసులను చూడలేదన్నారు. చిన్నంపల్లి మాజీ సర్పంచు కొండయ్య, పవన్‌కుమార్, సుధీర్, కక్కలపల్లి కాలనీ పంచాయితీ పిల్లిగుండ్ల కాలనీకి చెందిన వెంకటేష్‌గౌడ్, జాకీర్ కొట్టాల నాయకులు అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

కౌంటింగ్ సమాచారం లోపభూయిష్టం

అనంతపురం టౌన్ : ఎన్నికల కౌంటింగ్ సమాచారం అందించడంలో ఇటు అధికారులు... అటు సమాచారశాఖ తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింట్ జేఎన్‌టీయూలో మొదలు పెట్టారు. కౌంటింగ్ కేంద్రంలోకి గతంలో ఎన్నడూ లేని విధంగా మీడియాకు ఆంక్షలు పెట్టారు. దీంతో సమాచారం అందించడం కోసం కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ పట్టామని, అక్కడికి ఎప్పటికపుడు సమాచారం ఇస్తామని చెప్పారు. దీంతో మీడియా జర్నలిస్టులు ఉదయం నుంచి మీడియా పాయింట్‌కు చేరుకొని కౌంటింగ్ సమాచారం కోసం ఎదురు చూస్తూ వచ్చారు. రెండు మూడు రౌండ్ల సమాచారం మాత్రం మీడియా పాయింట్‌కు తీసుకొచ్చి అందించారు. ఆతర్వాత నుంచి కౌంటింగ్ సమాచారం లోపభూయిష్టంగా మారుతూ వచ్చింది. ఇక మధ్యాహ్నం నుంచి అయితే సమాచారం గురించి తెలిపేవాడే కరువయ్యారు. మీడియా జర్నలిస్టులు మాత్రం అదిగో వస్తుంది.. ఇదిగో వస్తుందని ఎదురు చూడటం పనిగా మారింది. కనీసం మధ్యాహ్నం పూట భోజనం కూడా ఏర్పాటు చేయలేదంటే కలెక్టరేట్లలో మీడియా పాయింట్‌ను ఏమాత్రం నిర్వహించారో అర్థమవుతోంది. దీనికి జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా సమాచారశాఖ అధికారులు మధ్య సమన్వయం లోపం.. మీడియా పట్ల చిన్నచూపే ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 4: జిల్లాలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ సంగీతకుమారి మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలోని నార్పల, డీ హిరేహాల్ పాఠశాలలో బాలికలకు, కుందుర్పి, కొనకొండ్ల పాఠశాలల్లో బాలురకు వివిధ కేటగిరీలలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 15వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు నార్పల పాఠశాల ప్రిన్సిపల్ 90008 61117 , గోనబావి పాఠశాల : 83094 83104, డి. హిరేహాల్ పాఠశాల : 78933 06450, కొనకొండ్ల పాఠశాల : 94905 00015, కుందుర్పి పాఠశాల 63092 92018ను సంప్రదించాలని సూచించారు.

ధర్మవరంలో వికసించిన కమలం

పరిటాల శ్రీరామ్ కృషితోనే గెలుపుబాట

ధర్మవరం, జూన్ 4: నియోజకవర్గ చరిత్రలో తొలి సారి కమలం వికసించింది. ఎన్డీఏ కూటమి(టీడీపీ, జనసేన, బీజేపీ)తరపున పోటీ చేసిన సత్యకుమార్‌యాదవ్ విజయకేతనం ఎగురవేశారు. స్థానికేతరుడైనా ఎన్డీఏ కూటమి తరపున బీజేపీ టికెట్ పొంది నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన 40రోజులకే ఓటరు అభిమానం చూరగొన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో కేవలం 622 ఓట్లు సాధించిన బీజేపీ ఈ ఎన్నికల్లో విజయం సాధించడం విశేషం. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అండతోనే ఇది సాధ్యమైనట్లు తెలుస్తోంది. పరిటాల కుటుంబానికి ధర్మవరం నియోజకవర్గంతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఈక్రమంలోనే పరిటాలశ్రీరామ్ ఎప్పటికప్పుడు శ్రేణులతో చర్చిస్తూ ధర్మవరంలో బీజేపీ గెలుపుకు కృషి చేశారు.

జీవితాంతం రుణపడి ఉంటా

నన్ను ఆదరించి, గెలిపించిన ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా. ఓటు అనే అయుధంతో రాష్ట్ర ప్రజలు సైకో ప్రభుత్వాన్ని నేలకూల్చారు. దివాళా తీసిన ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించే సత్తా రాష్ట్రంలో చంద్రబాబుకు, కేంద్రంలో నరేంద్రమోదీకి మాత్రమే ఉంది. ప్రపంచంలోనే కనివిని ఎరుగని ఆర్థిక నేరస్థుడిగా పేరుగాంచిన వ్యక్తికి సరైన సమయంలో ప్రజలు ఓటు అనే అయుధంతో బుద్ధి చెప్పారు. స్థానికేతరుడినైనా నాపై విశ్వసం ఉంచి గెలిపించిన మీ అందరికి జీవితాంతం రుణపడి ఉంటా. నా విజయంలో కీలక పాత్ర పోషించిన పట్టణ ప్రజలకు ఎల్లప్పుడు ఓసేవకుడిగా పనిచేస్తా.

- సత్యకుమార్



50 ఏళ్ల తరువాత ధర్మవరానికి బీసీ ఎమ్మెల్యే


ధర్మవరం నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఒక్కసారి మాత్రమే బీసీ అభ్యర్థి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 50 ఏళ్ల కిందట పల్లెం వెంకటేశ్ విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అగ్ర వర్ణాలవారే ధర్మవరంలో ఎమ్మెల్యేలుగా విజయం సాధిస్తూ వస్తున్నారు. 2024లో టీడీపీ బీజేపీతో కూటమి కట్టడం, అందులో భాగంగా అనూహ్యంగా బీసీ వర్గానికి చెందిన సత్యకుమార్‌యాదవ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. పరిటాల కుటుంబం, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి సహకారంతో కేవలం 40 రోజుల ప్రచారంతోనే ఓటర్లను ఆకట్టుకుని విజయం సాధించడం గమనార్హం.

బోణీ కొట్టిన బీజేపీ

ధర్మవరంలో తొలి సారి బారతీయ జనతాపార్టీ అసెంబ్లీ ఎన్నికలలో బోణీ కొట్టింది. ధర్మవరం చరిత్రలోనే బీజేపీకి మొదటి విజయం దక్కడంతో ఆ పార్టీ శ్రేణుల్లో సంబరం నింపింది. నియోజకవర్గంలో 2,45,758 ఓట్లు ఉండగా 2,18,282 ఓట్లు పోలయ్యాయి. వీటిలోకూడా బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌కు 1,04957 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి 1,01983 ఓట్లు లభించాయి. దీంతో 2974 ఓట్లు మెజారిటీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓటు ద్వారా వచ్చిన 760 మెజారిటీతో కలిపి సత్యకుమార్ యాదవ్ 3734 ఓట్లు అధిక్యత లభించింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1587 ఓట్లు బీజేపీకి రాగా వైసీపీకి 827, కాంగ్రెస్‌కు 36, ఇతరులకు 7 ఓట్లు రాగా మిగిలిన 798 ఓట్లు చెల్లనవిగా అధికారులు తేల్చేశారు. ధర్మవరం మండలం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలు వైసీపీకి జై కొట్టగా ధర్మవరం పట్టణ వాసులు మాత్రం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్‌కు అండగా నిలిచారు. వైసీపీకి 12 రౌండ్లలో ఓటర్లు ఆధిక్యం ఇవ్వగా బీజేపీకి 9రౌండ్లలో మాత్రమే ఓటర్లు ఆధిక్యత ఇచ్చారు. వైసీపీకి 1 నుంచి 10వ రౌండ్ వరకు, 20, 21, రౌండ్లలో మెజారిటీ రాగా బీజేపీకి 11 నుంచి 19వరౌండ్ వరకు మెజారిటీ వచ్చింది. బీజేపీకి 13,14,19,రౌండ్లలో భారీ మెజారిటీ వచ్చింది. 13వ రౌండ్‌లలో 3964 మెజారిటీ రాగా 14 వ రౌండ్‌లో 3942, 19వ రౌండ్‌లో 3454 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇదే వైసీపీకి ఓటమిని ఖరారు చేసింది. వైసీపీకి మూడో రౌండ్‌లో వచ్చిన 2734 ఓట్లే అత్యధిక మెజారిటీ. 1767 మంది నోటాకు ఓటు వేశారు.


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న పురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న కందికుంట వెంకటప్రసాద్


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న పల్లె సింధూర


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న సవిత


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న సత్యకుమార్


డిక్లరేషన్ ఫాం అందుకుంటున్న ఎంఎస్ రాజు



నందమూరి బాలకృష్ణ తరపున డిక్లరేషన్ అందుకుంటున్న అనిల్


అభిమానులు, కార్యకర్తలకు బాలయ్య నమస్సులు

నియోజకవర్గ ప్రజలదే ఈ విజయం: కందికుంట



కదిరి, జూన్ 4: నియోజకవర్గ ప్రజలదే ఈ విజయం. అహంకార పురితమైన జగన్మోహన్‌రెడ్డికి టీడీపీ విజయం చెంప పెట్టు లాంటిది. ప్రజలను, ఓటర్లుగా చూసే జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు బాగా బుద్ధి చెప్పారు. 151సీట్లు తనకు వచ్చాయని జగన్మోహన్‌రెడ్డి అహంకార పూరితంగా పాలన చేశారు. ఎమ్మెల్యేగా బాధ్యతతో పని చేస్తా. నా విజయానికి కృషి చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు. వైసీపీలో ఉంటూ, వైసీపీ నాయకత్వం పనితీరు నచ్చక తనకు సహకరించిన అజ్ఞాత నాయకుడికి కూడా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా. కదిరి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ, కదిరి ప్రజలకు జవాబుదారిగా ఉంటా.

మీ నమ్మకాన్ని వమ్ముచేయను: సవిత



పెనుకొండ టౌన్, జూన్ 4: నేను తొలిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశా. ఏ నమ్మకంతో ప్రజలు నాకు ఓటువేసి ఆదరించారో ఆ నమ్మకాన్ని వమ్ము చేయను. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానాలను అన్ని పూర్తి చేస్తా. వైసీపీ అభ్యర్థి ఉష శ్రీచరణ్ ధన, అధికార బలంతో మా కార్యకర్తలు, ప్రజలు, మీడియాను భయబ్రాంతులకు గురిచేసింది. అయితే ఎవరూ భయపడకుండా నామీద నమ్మకంతో పని చేశారు. వారందరికీ కృతజ్ఞతలు. తెలిపారు. ధర్మానికి అధర్మానికి మధ్య జరిగిన ఈ ఎన్నికల యుద్ధంలో ధర్మమే గెలిచిందన్నారు.

విజయ సింధూరం



పుట్టపర్తి/పుట్టపర్తిరూరల్, జూన్ 4: పుట్టపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యేగా సింధూర రెడ్డి 8760 ఓట్ల మెజారిటీతో వైసీపీ అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై గెలుపొందారు. అతి చిన్నవయస్సులో గెలుపొందిన ఎమ్మెల్యేల్లో రాష్ట్రంలోనే ఈమె మొదటిస్థానంలో నిలిచారు. తన మామ పల్లె రఘునాథరెడ్డి వారసురాలిగా రాజకీయ ఆరంగేట్రం చేసిన ఈమె తొలి యత్నంలోనే విజయం సాధించారు. పల్లె రఘునాథరెడ్డి నియోజకవర్గా నికి చేసిన సేవ, అభివృద్ధే ఈమె గెలుపునకు కారణమని పలువురు పేర్కొంటు న్నారు. సింధురరెడ్డి గెలుపుతో పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్ని వర్గాల ప్రజలు వ్యక్తం హర్షం వ్యక్తం చేస్తున్నారు. సింధూరరెడ్డి గెలుపుతో పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నిఅంటుతున్నాయి. విజయం సాధించిన పల్లె సింధూరరెడ్డికి ఆర్‌ఓ భాగ్యరేఖ డిక్లరేషన్ అందజేశారు.

తొలిమహిళా ఎమ్మెల్యేగా..

పుట్టపర్తి నియోజకవర్గం ఏర్పడిన తరువాత మొదటి మహిళా ఎమ్మెల్యేగా పల్లె సింధూరరెడ్డి గుర్తింపు పొందారు. పుట్టపర్తి నియోజకవర్గం ఏర్పడిన తరువాత పల్లె రఘునాథరెడ్డి టీడీపీ తరపున రెండు సార్లు గెలుపొందగా వైసీపీ తరపున దుద్దుకుంట శ్రీదర్‌రెడ్డి గెలుపొందారు. నాలుగో ఎమ్మెల్యేగా సింధూర రెడ్డి విజయకేతనం ఎగురవేశారు.

పుట్టపర్తి అభివృద్ధికి ప్రత్యేక కృషి

నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా. నియోజకవర్గ ప్రజలకు మరోసారి సేవచేసేందుకు తమ కుటుంబానికి అవకాశం కల్పించిన పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలియ చేస్తున్నా. ఒక్క అవకాశం ఇవ్వండని గత ఎన్నికల్లో గెలిచిన వైసీపీ అవినీతి పాలనకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో అంతం పలికారు. మా మామ పల్లె రఘునాథరెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తా.

ఉత్కంఠ పోరులో విజయం

మడకశిరటౌన్, జూన్ 4: మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే ఫలితాల వెల్లడిలో క్షణక్షణం ఉత్కంఠ నెలకొంది. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఎం.ఎస్.రాజు నియోజకవర్గాన్ని సుడిగాలిలా చుట్టేశారు. తన వాక్ధాటితో ఓటర్లను ఆకట్టుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సారథ్యంలో కేవలం 20 రోజుల ప్రచార కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నిర్వహించింది. వైసీపీలో ఏకనాయకత్వం లేకపోవడంతో పరాజయాన్ని స్వీకరించక తప్పలేదు. ఎం.ఎస్.రాజును నాన్ లోకల్ అంటూ ఎన్ని రకాలుగా దుష్ప్రచారం చేసినా ప్రజలు వాటిని నమ్మలేదు. చివరకు 399 ఓట్ల ఆధిక్యతతో వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్పపై విజయాన్ని కట్టబెట్టారు. దీంతో మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయ సంబరాల్లో మునిగిపోయారు.

మడకశిర ప్రజల అభిమానం మరువను

మడకశిర నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకుంటా. కేవలం 18 రోజులే ప్రచారం నిర్వహించినా నన్ను అక్కున చేర్చుకున్న ప్రజల అభిమానం ఎన్నటికీ మరువలేను. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మండలాల కన్వీనర్లు తనను గెలిపించేందుకు ఎంతగానో కృషి చేశారు. మడకశిర నియోజకవర్గం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా.

- ఎంఎస్ రాజు



కలిసి వచ్చిన పోస్టల్ బ్యాలెట్

మడకశిర నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ మధ్య పోరు నువ్వా నేనే అనేలా సాగింది. 18 రౌండ్ల కౌంటింగ్ పూర్తయ్యే సరికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎం.ఎస్.రాజు కేవలం 25 ఓట్ల లీడింగ్‌లో ఉన్నారు. ఈసందర్భంగా 36వ కేంద్రం, 131వ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు మొరాయించాయి. చివరిలో ఉత్కంఠ నెలకొనడంతో వైసీపీ నాయకులు కౌంటింగ్‌కు పట్టుబట్టారు. 36వ కేంద్రంలో వైసీపీ కన్నా బీఎస్‌పీకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. దీంతో వీవీ ప్యాట్‌లను లెక్కించాలని ఈవీఎం పని చేయడం లేదని వైసీపీ వారు కోరడంతో కలెక్టర్ సమక్షంలో లెక్కించారు. ఈతరుణంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకంగా మారాయి. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి టీడీపీ అభ్యర్థి ఎం.ఎస్.రాజుకు 722 రాగా, వైసీపీ అభ్యర్థి ఈరలక్కప్పకు 498 ఓట్లు వచ్చాయి. దీంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి 224 ఓట్ల ఆధిక్యతను లభించింది. దీంతోపాటు రెండు ఈవీఎంలలో సైతం కొంత మెజార్టీ రావడంతో అధిక్యత 319కి పెరిగి, విజయం సాధించారు.

పురం ఎంపీగా బీకే పార్థ

పుట్టపర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి వైసీపీ అభ్యర్థి శాంతపైన ఘన విజయం సాధించారు. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆయనకు ఆధిక్యత లభించింది. హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, రాప్తాడు, కదిరి, పుట్టపర్తి, మడకశిర నియోజకవర్గాల్లో ప్రతి రౌండ్‌లోను ఆధిక్యం సాధించారు. మొత్తం 1,32,427 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ధర్మవరం, పెనుకొండ, రాప్తాడు, హిందూపురం నియోజకవర్గాల్లో భారీ ఆధిక్యత సాధించారు. 1999లో తొలిసారిగా పార్లమెంటుకి ఎన్నికయ్యారు. ఇప్పుడు మరోసారి ఎంపీగా గెలుపొందారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి డిక్లరేషన్ అందుకున్నారు.

మధ్యలోనే వెనుదిరిగిన ఉష శ్రీచరణ్


కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుతిరుగుతున్న వైసీపీ అభ్యర్థి ఉష శ్రీచరణ్

పెనుకొండ టౌన్, జూన్ 4: హిందూపురంలోని బిట్స్ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రం నుంచి ఉదయం 11 గంటలకే పెనుకొండ వైసీపీ అభ్యర్థి, మంత్రి ఉషశ్రీ వెనుదిరిగారు. ఐదోరౌండ్ కౌంటింగ్ పూర్తయ్యే సరికి టీడీపీ అభ్యర్థి సవిత ఆధిక్యంలో నిలిచారు. ఓటమి తప్పదని నిర్ధారించుకున్న వైసీపీ అభ్యర్థి, మంత్రి ఉషశ్రీ.. భర్త చరణ్‌రెడ్డితో కలిసి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. మీడియా చుట్టుముట్టడంతో చేసేదిలేక తన వాహనంలో ఉన్న నీరు తాగి, తిరిగి కౌంటింగ్ కేంద్రంలోకి ఒంటరిగా వెళ్లి కాసేపు ఉండి బెంగళూరుకు వెళ్లిపోయారు.

ముఖం చాటేసిన మగ్బూల్

కదిరి, జూన్ 4: వైసీపీ అభ్యర్థి మగ్బుల్ అహమ్మద్ ఓడిపోగానే ముఖం చాటేశారు. కనీసం కౌటింగ్ సెంటర్ వద్దకు కూడా రాలేదు. ఓడిపోయినట్లు తెలియగానే బెంగుళూరు వెళ్లిపోయినట్లు సమచారం. కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌కు కదిరి ప్రజలు పట్టం కట్టారు.



ఓటమెరుగని కోట.. పురం

హిందూపురంలో 11వసారి సైకిల్ హవా
భారీగా పెరిగిన బాలయ్య మెజారిటీ

హిందూపురం, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ జోరు నడిచింది. నాలుగు దశాబ్దాల పార్టీ చరిత్రలో ఎన్నడూలేనివిధంగా ఓటు శాతం పెంచుకుంది. నందమూరి పురంగా పేరుగాంచిన హిందూపురంలో బాలయ్య హ్యాట్రిక్ సాధించగా.. 11వ సారి తెలుగు దేశం గెలుపొందింది. బాలకృష్ణకు గతంకంటే భారీ మెజార్టీని పురం ఓటర్లు కట్టబెట్టారు. మొదటిరౌండ్ నుంచి ఆఖరి వరకు ఒక రౌండ్ మినహా అన్నింటిలోనూ బాలయ్య జోరు తగ్గలేదు. పోస్టల్ బ్యాలెట్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోనే హిందూపురానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇందుకు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి హిందూపురం నియోజకవర్గ ఓటర్లు తెలుగు దేశం పార్టీని ఆదరిస్తూ ఇక్కడ అభ్యర్థులు ఎవరైనా సైకిల్‌దే హవా కొనసాగుతూ వచ్చింది. పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు రెండు సార్లు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించి ముఖ్యమంత్రిగా ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించారు. మూడవసారి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఆయన కుటుంబం నుంచి తనయుడు నందమూరి హరికృష్ణ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. నందమూరి తారకరామారావు తనయుడిగా నట వారసత్వం పుచ్చుకున్న నందమూరి బాలకృష్ణ రాజకీయ వారసత్వం పుచ్చుకుని 2014లో రాజకీయ అరంగేట్రం చేశారు. ఇక్కడి వైసీపీ అభ్యర్థిపై 16196 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రెండోసారి వైసీపీ అభ్యర్థి షేక్ మహ్మద్ ఇక్బాల్‌పై 17028 ఓట్లతో విజయకేతనం ఎగురవేశారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థి దీపికపై 32,597 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. వైసీపీ ఎన్ని పన్నాగాలు పన్నినా, ఎంత డబ్బు వెదజల్లినా బాలయ్యవైపే పురం ఓటర్లు నిలిచారు. ఇటీవల వైసీపీ పెద్దలైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొదలుకుని గల్లీనాయకుల వరకు హిందూపురం తెలుగుదేశం పార్టీకి కంచుకోట కాదనీ, ఇసుక కోట అన్నారు. ఓటర్లు 11వ సారి కూడా టీడీపీకి పట్టం కట్టి హిందూపురం కంచుకోట అని నిరూపించారు.


మాట్లాడుతున్న బాలకృష్ణ


కందికుంట రెండోసారి..

కదిరి, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి కదిరి అసెంబ్లీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ రెండోసారి విజయం సాధించారు. మొదట కందికుంట మెజార్టీ సాధించారు. తరువాత ఆధిక్యం దోబూచులాడింది. మళ్లీ పంజుకున్న కూటమి అభ్యర్థి కందికుంట 6,265 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి 7వ రౌండ్ వరకు కూటమి అభ్యర్థి లీడ్‌లో కొనసాగారు. 8వ రౌండ్ నుంచి 14 వరకు వైసీపీ లీడ్‌లో నిలిచింది. 15 నుంచి 21వ రౌండ్ వరకు కూటమి మెజార్టీకి తిరుగులేకుండా పోయింది.

బదిలీ చేసినా ఓటమే

హిందూపురం, జూన్ 4: ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు సామంత రాజులుగా వ్యవహరించారు. భూ సెటిల్‌మెంట్లు, దందాలు, అవినీతితో వందల కోట్లు వెనుకేసుకున్నారు. ఈనేపథ్యంలో ఆపార్టీ అధినేత జగన్మోహనరెడ్డి జిల్లాలో కొన్ని చోట్ల అభ్యర్థులను బదిలీ చేశారు. అయినా జనం ఎవ్వరూ నమ్మలేదు. కళ్యాణదుర్గంలో ఉష శ్రీచరణ్ చేసిన ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. సొంత పార్టీ నాయకులపైనే కేసులు పెట్టించారు. వందల ఎకరాల భూములు కొట్టేశారు. అందుకే కళ్యాణదుర్గంలో అయితే ఆమె గెలవరని పెనుకొండకు పంపారు. ఇక్కడ ఉన్న శంకరనారాయణను అనంతపురం పంపారు. అయితేనేం ఇద్దరూ ఓడిపోయారు. ఇక్కడ ఉన్న గోరంట్ల మాధవ్ వికృత చర్యలకు ఆయనను పక్కన పెట్టి కర్ణాటకకు చెందిన శాంతమ్మను తీసుకొచ్చి పోటీ పెట్టారు. ఆమె గెలవలేదు. మడకశిరలో సామాన్య వ్యక్తి అని ఈరలక్కప్పకు టికెట్ ఇచ్చారు. కదిరిలో సిద్దారెడ్డికి కాదని మగ్బూల్‌కి ఇచ్చారు. ఈ చర్యలన్నీ బెడిసి కొట్టి వైసీపీకి మరువలేని పరాజయాన్ని మిగిల్చాయి.

నోటాకు నాలుగో స్థానం



హిందూపురం, జూన్ 4: హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నోటాకు నాలుగో స్థానం దక్కింది. నోటాకు మొత్తం 1686 ఓట్లు వచ్చాయి. ఇందులో పది పోస్టల్ బ్యాలెట్లు సైతం ఉండటం గమనార్హం. తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన నందమూరి బాలకృష్ణకు 1,07,250, వైసీపీ తరపున పోటీ చేసిన దీపికకు 74,653, కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసిన ఎంహెచ్ ఇనాయతుల్లా 8958, నోటాకు 1686 వచ్చాయి.

కూటమి కార్యకర్తలపై వైసీపీ మూకల దాడి


ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్రవంత్

ధర్మవరం రూరల్, జూన్ 4: రాష్ట్రంలో, ధర్మవరంలో ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ మూకలు.. టీడీపీ, జనసేన కార్యకర్తలపై దాడులకు దిగాయి. మండలంలోని గొట్లూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం టీడీపీకి చెందిన చలసాని వెంకటేష్, జనసేన కార్యకర్త స్రవంత్ బైక్‌పై వెళ్తుండగా.. వైసీపీ నాయకుడు మారుతి ఇంటి వద్ద అతడితోపాటు అనుచరులు పిట్టారాజు, చాకలి క్రిష్ణ, జెన్నె రామాంజనేయులు, చలసాని శ్రీనివాసులు, ఉప్పర శివ, నాగభూషణ, జెన్నె వెంకటేష్, పామాల శీనా, సంగలప్ప, చాకలి నాగేంద్ర అడ్డు తగిలారు. ఎక్కువ చేస్తున్నారంటూ కట్టెలతో దాడిచేశారని బాధితులు తెలిపారు. గాయపడిన చలసాని వెంకటేష్, స్రవంత్‌ను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ధర్మవరంలో బీజేపీ విజయోత్సవ ర్యాలీ

అడుగడుగునా పూలవర్షం

ధర్మవరం, జూన్ 4: ధర్మవరం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యేగాసత్యకుమార్ యాదవ్ గెలుపొందడంతో ధర్మవరంలో మంగళవారం రాత్రి విజయోత్సవ ర్యాలీని కూటమి శ్రేణులు భారీగా నిర్వహించారు.ఈ ర్యాలీ పట్టణంలోని కేతిరెడ్డికాలనీ నుంచి సత్యకుమార్‌యాదవ్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్, కూటమి ముఖ్యనాయకులతో కలిసి ప్రత్యేక వాహనంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అడుగడుగునా కూటమి శ్రేణులు, అభిమానులు గజమాలలతో సత్యకుమార్,పరిటాలశ్రీరామ్‌లను ఘనంగా సత్కరించారు. ఈ ర్యాలీ లక్ష్మీచెన్నకేశవపురం, సాయిబాబాగుడి, ఆర్టీసీ బస్టాండ్, కాలేజ్, కళాజ్యోతి, అంజుమన్‌సర్కిల్ మీదుగా తేరుబజారు, దిమ్మలీసెంటర్, కదిరిగేటు వరకు ర్యాలీ కొనసాగింది.ఈ ర్యాలీలో బారీ ఎత్తున కూటమిశ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యకుమార్ యాదవ్

అంబరాన్నంటిన టీడీపీ సంబరాలు

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం అనంతపురం పార్లమెంటు పరిధిలో అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ విజయభేరి మోగించింది. టీడీపీ విజయంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. పోలీసుల ఆంక్షలు ఉన్నా నాయకులు రోడ్లమీదకు వచ్చి టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. టపాసులు పేల్చి, జెండాలు చేతపట్టి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించి ఆనందంలో మునిగి తేలారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


ఉరవకొండలో...


బొమ్మనహాళ్‌లో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు


యాడికి: టీకొత్తపల్లిలో టపాసులు కాలుస్తున్న మహిళలు


విడపనకల్లులో...


గుంతకల్లులో సంబరాలు చేసుకుంటున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోడెల ఆపర్ణ, నాయకులు


ఉరవకొండలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


యాడికి మండలం రాయలచెరువులో...


కూడేరులో...


రాయదుర్గం మండలం ఉడేగోళంలో...


కణేకల్లులో...


గుత్తి రూరల్ బసినేపల్లిలో...


గుత్తిలో...


కళ్యాణదుర్గంలో సైకిల్ ఎత్తుకుని విజయోత్సాహం


రాయదుర్గంలో కాపుతో అనుచరవర్గం సంబరాలు


రాయదుర్గంలో అమ్మవారికి టెంకాయలు కొడుతున్న నాయకులు


పామిడిలో...


పుట్లూరులో...


గుంతకల్లులో...

ఓటమి జీర్ణించుకోలేక వైసీపీ దాడులు


గాయపడిన పార్వతయ్య

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 4: ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ మూకలు రెచ్చిపోయి టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన ఘటన మున్సిపల్ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు టీడీపీ ఘన విజయం సాధించడంతో మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలు రామన్న, పార్వతయ్య, అంజినప్పలపై వైసీపీ రౌడీమూకలు అశోక్, హరి రాజశేఖర్, హరికృష్ణ, రంజిత్, రఘు, ప్ర శాంత్ మరికొంతమంది కలిసి కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచా రు. వెంటనే టీడీపీ కార్యకర్తలను చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తలపై దాడి


గాయపడిన రంజిత్‌కు చికిత్స చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లిలో కూటమి విజయంతో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు కారంపొడి చల్లి రాళ్లతో దాడి చేశారు. దాడిలో పశువుల కిష్టప్ప, దళిత రంజిత్‌లకు గాయాలయ్యాయి. ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. ఓటమిని జీర్ణించుకోలేకనే వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారని దామోదర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆరుగురుకి గాయాలు


దాడిలో గాయపడిన టీడీపీ నాయకులు

గుత్తిరూరల్: మండలంలోని టీ.కొత్తపల్లి గ్రామంలో మంగళవారం టీడీపీ వర్గీయుల పై వైసీపీ వర్గీయులు దాడి చేయడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు పెద్దయ్య, అంజినప్ప, సూరీ, ఓబులపతి, చిన్నఓబన్న, వెంకటరాముడు, టీడీపీ పార్టీ గెలవడంతో ఆనందంలో ఉండడంతో వైసీపీ వర్గీయులు ఈశ్వరయ్య, చంద్ర, సుధాకర్, నీలకంఠ, సురేష్, హరి, మహేంద్ర, మహేష్, కిరణ్ జీర్ణించుకోలేక వారిపై కర్రలతో రాళ్లతో దాడికి దిగారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో టీడీపీకి చెందిన పెద్దయ్య, అంజీనప్ప, చిన్నఓబన్న, వెంకటరాముడు, ఓబులపతి, సూరీలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డిన వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు పెద్దయ్యను అనంతపురానికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తెలుగు తమ్ముళ్లను చితకబాదిన పోలీసులు


గాయపడిన చంద్రశేఖర్

యాడికి, జూన్4: టీడీపీ విజయంతో సంబరాలు చేసుకుంటున్న ఇద్దరు తెలుగు తమ్ముళ్ళపై పోలీసులు లాఠీ ఝుళిపించారు. లాఠీదెబ్బలతో టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన దేవేంద్ర, చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. దేవేంద్రను వెనుకభాగంలో లాఠీతో కొట్టడంతో చర్మం కంది ఎర్రగా మారింది. చంద్రశేఖర్‌ను చేతిపై లాఠీతో చితకబాదారు. గాయపడిన దేవేంద్ర, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ పోలీసులు పైశాచికంగా దాడిచేసి కొట్టారని తెలిపారు.

టీడీపీ నాయకులపై దాడి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నాయకులు

పుట్లూరు, జూన్ 4: మండలంలోని చింతకుంట గ్రామంలో మంగళవారం సాయంత్రం ఎన్నికల ఫలితాల అనంతరం సంబరాల్లో భాగంగా బాణాసంచా కాలుస్తున్న టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దాడిచేశారు. దాడిలో సర్పంచు శివరామయ్య, శ్రీకాంత్, మల్లేశ్వరమ్మ, ప్రతాప్, శివకుమార్‌రెడ్డి, బ్రాహ్మిణి గాయపడ్డారు. బాణాసంచా కాలుస్తున్న సమయంలో ఎందుకు కాలుస్తున్నావ్ అంటూ దుర్భాషలాడుతూ మహిళలపై రాళ్లు, కట్టెలతో విరుచుకుపడ్డారు. ఎక్కడబడితే అక్కడ మహిళలపై చేతులతో పిడిగుద్దులు గుద్దారు. దీంతో మహిళలకు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. మరో వ్యక్తికి కంటికి గాయం కావడంతోపాటు చేయి విరిగింది. దీంతో వైసీపీకి చెందిన కొందరికి మాత్రం స్వల్పగాయాలు కావడంతో ఇరువురిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో సైతం టీడీపీ నాయకులపై మరోసారి దాడిచేసేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు వైసీపీ వర్గాన్ని చెదరగొట్టారు. సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు.

పోలీసుల అత్యుత్సాహం

● ఆంధ్రజ్యోతి విలేకరి చొక్కాపట్టి లాగేసిన కానిస్టేబుల్


ఆంధ్రజ్యోతి విలేకరిని లాక్కెళుతున్న కానిస్టేబుల్

పెద్దవడుగూరు, జూన్ 4: టీడీపీ ఘన విజయంతో మండలానికి చెందిన కార్యకర్త ఆనందంతో శాంతియుతంగా బైక్‌కు జెండా కట్టుకొని స్వగ్రామానికి వెళుతుండగా కానిస్టేబుల్ తిరుమల్‌రెడ్డి బైక్‌ను అడ్డగించాడు. చొక్కా పట్టుకొని స్టేషన్‌లోకి ఈడ్చుకువెళుతుండగా గమనించిన ఆంధ్రజ్యోతి విలేకరి శివప్రసాద్‌రెడ్డి ఫొటో తీసే ప్రయత్నం చేయగా సదరు కానిస్టేబుల్ చిందులు వేశాడు. ఎవరు నువ్వు ఎందుకు ఫొటో తీస్తున్నావ్ అంటూ మండిపడ్డాడు. నేను విలేకరిని అంటూ చెబుతుండగా చొక్కా పట్టుకొని ముందు నువ్వు కూడా స్టేషన్‌కు రా అంటూ అసభ్యపదజాలంతో దూషించాడు. అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్ కలుగజేసుకొని తెలిసిన వ్యక్తి అని చెప్పడంతో విడిచిపెట్టారు.

లక్షుంపల్లిలో టీడీపీ కార్యకర్తపై దాడి

యాడికి, జూన్4: మండలంలోని లక్షుంపల్లిలో టీడీపీ కార్యకర్త శ్యామ్‌పై వైసీపీకి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడిచేసి కత్తితో పొడిచారు. శ్యామ్ చేతికి గాయమైంది. టీడీపీ గెలుపుతో గ్రామంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు. ఆ సమయంలో శ్యామ్ తోటవద్ద నుంచి ఇంటికి వస్తున్నట్లు తెలిపాడు. దారిలో అడ్డుగా వచ్చి వైసీపీకి చెందిన శివకుమార్, భరత్, ఓబులపతి దాడిచేసి శ్యామ్‌ను కత్తితో పొడిచినట్లు తెలిపారు. బాధితున్ని రాయలచెరువుకు తీసుకువెళ్లి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి ఇరువర్గాల వారిని చెదరగొట్టారు.

విద్యుత్ తీగలు పడి 45 గొర్రెలు మృతి

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 4: మండలంలోని బోరంపల్లి సమీపంలో గొర్రెల మందపై 11 కేవీ వైర్లు పడి 45 గొర్రెలు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన జోగి ఆంజనేయులు గొర్రెలను మేత కోసం వలసలు వెళ్తుంటారు. ఈ క్రమంలో బోరంపల్లి సమీపంలో నెల రోజుల క్రితం చిన్న టెంట్ ఏర్పాటు చేసుకుని చుట్టుపక్కల పొలాల్లో మేత కోసం తిరిగి టెంట్ దగ్గరికి వచ్చారు. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో 11 కేవీ వైర్లు పడి 45 మృతి చెందినట్లు తెలిపారు. రూ. 2.70 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి

బ్రహ్మసముద్రం, జూన్ 4: మండలంలోని రాయలప్పదొడ్డి గ్రామంలో ఆర్ తిమ్మప్పకు చెందిన రెండు ఆవులు పిడుగుపాటుకు మృతి చెందాయి. రైతు తెలిపిన మేరకు మంగళవారం మధ్యాహ్నం వర్షంతో పాటు పిడుగులు పడటంతో వ్యవసాయ తోటలో మేత కోసం తీసుకెళ్లిన రెండు ఆవులు పిడుగు పడి మృతి చెందాయన్నారు. రూ.లక్ష నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.

చంద్రబాబు విజయం.. అమ్మోరి దేవర


టీడీపీ నాయకుల సంబరాలు

విడపనకల్లు, జూన్ 4: టీడీపీ అఖండ విజయం సాధించడంతో మండలంలోని పెద్ద కొట్టాలపల్లికి చెందిన పార్టీ నాయకులు గ్రామస్థులు కలిసి అమ్మవార్లకు దేవర నిర్వహించారు. గ్రామంలోని సుంకులమ్మదేవికి, చౌడమ్మదేవికి, పెద్దమ్మదేవికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చంద్రబాబు చిత్రపటాన్ని అభిషేకించారు. మాజీ ఎంపీటీసీ రవీంద్ర, నాయుడు, ఓబుళయ్య, అమరేంద్ర, లోకేష్, రంగనాయకులు, మంజూ, సోమప్ప, సురేష్ పాల్గొన్నారు.

జేసీ అశ్మిత్‌రెడ్డికి శుభాకాంక్షలు


విజయ సంకేతం...

తాడిపత్రిటౌన్, జూన్ 4: అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి తరఫున పోటీచేసి ఘనవిజయం సాధించిన జేసీ అశ్మిత్‌రెడ్డికి టీడీపీ నాయకుడు రాయల్ మురళీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురంలోని జేసీ పవన్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఆయన జేసీ పవన్‌రెడ్డిని, జేసీ అశ్మిత్‌రెడ్డిని కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కూడేరు, జూన్ 4: అనంతపురం పట్టణానికి చెందిన సుభాన్ (50) అనేవ్యక్తి పీఏబీఆర్ డ్యాం నీటిలోపడి మృతిచెందాడు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు సుభాన్ ఉరవకొండ పట్టణంలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సుభాన్ తన స్నేహితులతో కలసి పీఏబీఆర్ డ్యాంలో డిన్నర్ చేసుకున్నారు. సుభాన్ మృతిపై అనుమానం ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నీటిలోనున్న శవాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిస్థితిని సమీక్షించిన డీఐజీ

తాడిపత్రిటౌన్, జూన్ 4: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గతంలో తాడిపత్రి నియోజకవర్గంలో జరిగిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మంగళవారం డీఐజీ షిమోషి దగ్గరుండి సమీక్షించారు. ఎన్నికలరోజు జరిగిన రాళ్లదాడులతో తాడిపత్రి అట్టుడికిపోయింది. మరోసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్షించారు. కట్టుదిట్టమైన భద్రతపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నీట్‌లో జశ్వంత్‌రెడ్డికి 90వ ర్యాంక్



యాడికి, జూన్ 4: ఆల్ ఇండియా నీట్‌లో యాడికి విద్యార్థి సాయి జశ్వంత్‌రెడ్డి 90వ ర్యాంక్ సాధించాడు. నీట్‌లో 720మార్కులకు గాను 715మార్కులు సాధించి 90వ ర్యాంక్ సాధించాడు. ఎంబీబీఎస్ చదివి డాక్టర్‌గా వైద్యసేవలు అందించడమే తన లక్ష్యమని జశ్వంత్‌రెడ్డి తెలిపారు. తండ్రి కొండారెడ్డి ప్రైవేట్ వైద్యునిగా, తల్లి మహితా కిరణ్ వ్యవసాయశాఖ అధికారిగా పనిచేస్తున్నారు. సాయిజశ్వంత్‌రెడ్డిని పలువురు అభినందించారు.

వైసీపీ ఆశలు గల్లంతు..!

గుంతకల్లు, జూన్4: వైసీపీ నాయకులు పెట్టుకున్న ఆశలను గుంతకల్లు పట్టణం వమ్ము చేసింది. పట్టణంలో ముస్లిం, దళితులు, వైశ్యులు, క్రైస్తవుల ఓట్లు అత్యధికంగా ఉన్నాయని, వాటి ద్వారా గెలుపుతీరాలకు చేరవచ్చని వైసీపీ నాయకులు అంచనాలు పెట్టుకుని కౌంటింగ్ కేంద్రానికి వచ్చారు. కానీ అనుకున్నన్ని ఓట్లు రాకపోవడంతో ఖంగుతిన్నారు. పట్టణంలో ఎంత తక్కువన్నా 15 వేల ఓట్లయినా ఆధిక్యం లభిస్తుందని కొండంత ఆశలు పెట్టుకుని పందేలకు సిద్ధపడ్డారు. గత ఎన్నికల్లో 48,532 ఓట్లతో వెంకటరామిరెడ్డి గెలిచారని, ఇప్పుడు 40వేల ఓట్ల మెజారిటీ తగ్గినా కనీసం 8 వేల ఓట్లతోనైనా గెలుపు సాధిస్తారని నమ్మకం పెట్టుకున్నారు. ఒకటికి ఒకటిన్నర ఇస్తామంటూ పందేలు ఒడ్డారు. కౌంటింగ్‌లో అనుకున్నట్లుగానే తొలి రెండు రౌండ్లు టీడీపీకి ఆధిక్యం లభించగా, పట్టణ ఓట్లు 3వ రౌండ్ నుంచి 9వ రౌండ్ వరకూ వైసీపీ ఆధిక్యాన్ని కనబరచింది. కానీ వైసీపీ నాయకులు అనుకున్నట్లు 15 వేల ఆధిక్యం లభించలేదు. రెండవ రౌండులో టీడీపీకి 1,185 ఓట్లు ఆధిక్యంలో ఉండగా, వైసీపీ 3వ రౌండులో ఆ ఆధిక్యాన్ని బ్రేక్‌చేసి 104 ఓట్ల మెజారిటీని తెచ్చుకుంది. 4వ రౌండ్‌లో 2,608 ఓట్లు, 4వ రౌండ్‌లో 3,540 ఓట్ల లబ్ధి చేకూరింది. ఇక ఇదే విధంగా మెజారిటీ పెరుగుతూ పోతుందని అధికార పార్టీ నాయకులు భావించారు. కానీ 9వ రౌండ్‌కు వచ్చేసరికి ఆ ఆధిక్యం 920 ఓట్లకు తగ్గిపోయింది. ఇక 10వ రౌండ్ ప్రారంభం అయ్యేసరికి గుంతకల్లు మండలంలోని గ్రామాల పోలింగ్ బూత్‌లు ప్రారంభం కావడంతో టీడీపీ 262 ఓట్లతో మరలా ముందుకు వచ్చింది. అంతే ఇక వెనక్కు తిరిగి చూసుకోలేదు. గుత్తి పట్టణం, గుత్తి మండలం, పామిడి మండలం టీడీపీకి పట్టంకట్టాయి. పామిడి పట్టణం టీడీపీకి కాస్త నిరాశపరచినా 20 రౌండ్లు పూర్తయ్యే సరికి 6,826 ఓట్ల మెజారిటీతో జయరాం గెలుపు తీరాలకు చేరుకున్నారు.

కలిసివచ్చిన కుల సమీకరణ

● వైసీపీకి తగ్గిన ఓట్లు

గుంతకల్లు, జూన్ 4: పార్టీ అధిష్టానం చేసిన వాల్మీకి కుల సమీకరణం గుంతకల్లు నియోజకవర్గానికి కలసి వచ్చింది. గత ఎన్నికల్లో వైసీపీ దాదాపు 48 వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందడంతో, ఈసారి టీడీపీ అధిష్టానం కుల సమీకరణాన్ని మార్చి కౌంటర్ ఎటాక్‌తో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. నియోజకవర్గంలో వాల్మీకులు అత్యధిక ఓట్లు కలిగిన సామాజికవర్గంగా ఉండటంతో గుమ్మనూరు జయరాంపై నమ్మకముంచి అభ్యర్థిత్వాన్ని ఇచ్చింది. పార్టీ పెట్టిన నమ్మకం వమ్ముకాకుండా వాల్మీకులు జయరాంకు అక్కున చేర్చుకున్నారు. అంతేకాకుండా గత ఎన్నికల్లో వైసీపీకి ఓటువేసిన ముస్లింలు, కురుబలు, దళితులు టీడీపీ వైపు మొగ్గారు. ఈ కారణంగా వైసీపీ అభ్యర్థికి గత సంవత్సరం వచ్చిన ఓట్ల కంటే తక్కువ ఓట్లు లభించాయి. గత ఎన్నికల కంటే 38,500 ఓట్లు పెరిగినా, ఈ ఎన్నికల్లో వైసీపీకి 2019 ఎన్నికల కంటే 11 వేల ఓట్లు తక్కువగా లభించాయి. టీడీపీకి గత ఎన్నికలలో వచ్చిన ఓట్ల శాతంతో పోలిస్తే ఈసారి దాదాపు 19 శాతం ఓట్లు అధికంగా వచ్చాయి.

డిక్లరేషన్ జారీలో జాప్యం: గుంతకల్లు నియోజకవర్గ ఈవీఎం ఓట్ల లెక్కింపు కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకే పూర్తయినా పోస్టల్ ఓట్ల లెక్కింపు పూర్తికాకపోవడంతో డిక్లరేషన్ జారీలో దాదాపు మూడు గంటల ఆలస్యమైంది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ పూర్తికావడంతో జయరాం గెలిచినట్లు ఆర్వో శ్రీనివాస రెడ్డి డిక్లరేషన్‌ను అందజేశారు.

చరిత్ర తిరగరాసిన టీడీపీ తమ్ముళ్లు

● 30 ఏళ్ల సెంటిమెంట్ బద్ధలు


కేరింతలు వేస్తున్న తెలుగుతమ్ముళ్లు

బెళుగుప్ప, జూన్ 4: టీడీపీ శ్రేణులు కఠోర శ్రమకు ఫలితం దక్కింది. సెంటిమెంట్‌ను బద్దలుకొట్టారు. 30 ఏళ్ల చరిత్రను తిరగరాశారు. గతంలో ఎమ్మెల్యేగా గెలిస్తే ఆ పార్టీ అధికారంలో రాదని వైసీపీ వారు నమ్ముతూ ఆ పార్టీ వాళ్లే ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ గెలుస్తారని పరోక్షంగా చెప్పుకున్నారు. అరాచకపాలన వైసీపీని సాగనంపితేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని టీడీపీతో పాటు మేధావి వర్గం ఆలోచనలో పడేసింది. ఈ ఎన్నికలలో కూటమి అధికారంలోకి వస్తుందని ఎలాగైనా పయ్యావుల కేశవ్‌ను గెలిపించుకోవాలని టీడీపీ శ్రేణులు మునుపెన్నడూలేని విధంగా కష్టపడ్డారు. పయ్యావుల కేశవ్ విజయం సాధిస్తే మంత్రివర్గంలో చోటు దక్కుతుందన్న నమ్మకం కార్యకర్తలలో నమ్మకం కలిగింది. వైసీపీ కంచుకోట గ్రామాలలో కూడా టీడీపీకి మెజారిటీ వచ్చేలా కృషి చేశారు. సెంటిమెంటును బద్దలు చేసిన 1994 రిపీట్ 2024 చేసేందుకు సైనికుల్లా పనిచేశారు.

సంబరాలను అడ్డుకున్న పోలీసులు


టపాసులను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

పామిడి, జూన్ 4: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడంపై తెలుగు తమ్ముళ్ల సంబరాలను పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలోని ఎద్దులపల్లి సర్కిల్‌లో టీడీపీ విజయోత్సవ సంబరాలను సీఐ రాజశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో అడ్డుకున్నారు. తెలుగు తమ్ముళ్లు తిరగబడ్డారు. వాగ్వాదం జరుగుతుండగానే బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు. దీంతో పోలీసులు చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. ఎద్దులపల్లి సర్కిల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు.

టీడీపీ శ్రేణులను చెదరగొట్టిన పోలీసులు


టీడీపీ శ్రేణులను తరుముతున్న పోలీసులు

విడపనకల్లు, జూన్ 4: కౌంటింగ్ ప్రారంభం అయిన కొద్ది సమయంలోనే మండల కేంద్రంలో టీడీపీ నాయకులు 11గంటలకే స్థానిక బస్టాండ్ ప్రాంతానికి చేరుకున్నారు. టీడీపీ కూటమి 137స్థానాల్లో ముందంజలో ఉందని తెలియటంతో మిఠాయిలు పంపిణీ చేస్తూ బాణా సంచాలు కాల్చే ప్రయత్నాలు చేశారు. దీన్ని గమనించిన పోలీసులు లాఠీలతో టీడీపీ నాయకులను చెదరగొట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవ్వరు రోడ్లపైకి రాకూడదు అంటూ తరిమారు. గుంతకల్లు డీఎస్పీ భాస్కర్‌రెడ్డి, ఉరవకొండ సీఐ ప్రవీణ్‌కుమార్, విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్, ప్రత్యేక పోలీస్ సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు.

కళ్యాణదుర్గం నిర్మానుష్యం

● బోసిపోయిన బస్టాండు.. పోలీసుల పటిష్ట బందోబస్తు


కళ్యాణదుర్గం టి-సర్కిల్ నిర్మానుష్యం

కళ్యాణదుర్గం, జూన్ 4: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పట్టణంలో కట్టుదిట్టమైన పోలీసు భద్రత చేపట్టారు. ముందస్తుగా గొడవలు లేకుండా పోలీసులు కలియతిరుగుతూ సమాచారం ఇచ్చారు. పట్టణంలోని టీ సర్కిల్, వాల్మీకి సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, రింగ్ రోడ్డు, బళ్లారి మిట్ట ప్రాంతాల్లో పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ జనసంచారం లేకుండా చూశారు. సీఐ హరినాథ్ ఆధ్వర్యంలో పలు కాలనీలు, ప్రధాన వీధుల్లో సంచరిస్తూ విజయోత్సవ ర్యాలీలు, టపాసులు కాల్చకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కంబదూరు మండలంలోని కురాకుల పల్లి, జల్లిపల్లి, కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లి గ్రామాల్లో అమిలినేని గెలుపుపై సంబరాలు చేసుకుంటూ ఆయా గ్రామాల గ్రామదేవతలకు జంతుబలి ఇచ్చారు. పల్లె ప్రాంతాల్లో సైతం సురేంద్రబాబు బ్యానర్ చేత పట్టుకుని నినాదాలు చేస్తూ ఊరేగింపులు చేపట్టారు. శాంతియుతంగా కౌంటింగ్ ప్రక్రియ ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.


తాడిపత్రిలో బోసిపోయిన మార్కెట్

మూతపడ్డ వ్యాపార సముదాయాలు

తాడిపత్రిటౌన్: కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. సీబీరోడ్డు, పుట్లూరురోడ్డు, యల్లనూరురోడ్డు, మెయిన్‌బజారు ప్రాంతాలన్ని నిర్మానుష్యంగా కనిపించాయి. ఎన్నికల నేపథ్యంలో తాడిపత్రిలో రాళ్లదాడులు జరిగాయి. దీంతో 144సెక్షన్ అమలులో ఉండడంతో బయటకు ఎవరూ రాలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. దినసరి కూరగాయల మార్కెట్ కూడా బోసిపోయింది.

యాడికి: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోలీసులు 144సెక్షన్ ప్రకటించడంతో యాడికి అంతా నిర్మానుష్యంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాణిజ్య దుకాణాలన్ని మూతపడ్డాయి. సీఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.